Since 2004
RNI No.Ap Tel 14145/2004a
# పిడికిలి
స్పెషల్ ఎడిషన్
The Peoples Paper

రిపోర్టర్‌లు కావలెను
గత 2004 సంవత్సరం నుంచి నిరాటంకంగా నడుస్తున్న పిడికిలి మాస పత్రిక స్పెషల్ ఎడిషన్ దిన పత్రికకు తెలుగు రాష్ట్రాల్లోని మండలాలు, మున్సిపాలిటీ, నగర పంచాయతీలు, మున్సిపల్ డివిజన్ల వారీగా విలేకరులు కావలెను.
ఆసక్తిగలవారు సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్
9866663153

సంపుటి : 20 సంచిక : 01 | మంగళవారం 21 - 07 - 2026 | చీఫ్ ఎడిటర్ : చామకూర రాజు | పేజీలు : 4 వెల : రూ. 5.00

# కేంద్రంపై సీఎం రేవంత్ రెడ్డి ఫైర్



- ఢిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జ్
- ఢిల్లీలో నీట్ విద్యార్థుల ఆందోళనపై పోలీసుల లాఠీఛార్జ్
- కేంద్ర ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించిన సీఎం రేవంత్ రెడ్డి
- ప్రశ్నిస్తున్న యువతపై దాడులు బీజేపీ భయానికి నిదర్శనమన్న సీఎం
- కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్
- విద్యార్థులకు అండగా ఉంటానని స్పష్టం చేసిన రేవంత్


**హైదరాబాద్ :** నీట్-యూజీ 2026 పరీక్ష నిర్వహణలో చోటుచేసుకున్న అవకతవకలపై దేశ రాజధాని ఢిల్లీలో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసుల చర్యను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. శాంతియుతంగా ఆందోళన నిర్వహిస్తున్న వారిపై లాఠీఛార్జ్ చేయడం, బాష్పవాయువు ప్రయోగించడం అత్యంత దారుణమని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంలో విద్యార్థులకు ఆయన తన పూర్తి మద్దతు ప్రకటించారు. సోషల్ మీడియా వేదికగా స్పందించిన రేవంత్ రెడ్డి, విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిన కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు వారి గొంతు నొక్కేందుకు పోలీసు బలగాలను ప్రయోగిస్తోందని ఆరోపించారు. "నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పడిన ప్రతి దెబ్బ.. ప్రశ్నలన్నా, నిజమన్నా బీజేపీకి ఉన్న భయాన్ని బహిర్గతం చేస్తోంది. నీట్ కుంభకోణంపై కేంద్రం ప్రభుత్వం జవాబుదారీతనం వహించాలి. దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు నేను - మిగతా 2 లో

# తెలంగాణలో ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా ఉంది



- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలి
- ఎల్‌నినో ప్రభావంపై అధికారులతో సమీక్ష నిర్వహించిన ప్రభుత్వం
- తెలంగాణ రాష్ట్రంలోనే ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా ఉందన్న మంత్రి ఉత్తమ్ కుమార్

**హైదరాబాద్ :** రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినోను - మిగతా 2 లో




## తెలంగాణలో క్యూఆర్ కోడ్‌తో కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు

- 3 నెలల బియ్యం ఒకేసారి పంపిణీ
- క్యూఆర్ కోడ్‌తో పటిష్ఠ భద్రతా ఫీచర్లతో కొత్త కార్డుల రూపకల్పన
- ఆగస్టు నుంచి మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ
- రేషన్ సరుకులకు జులై 31 లోగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవడం తప్పనిసరి

**హైదరాబాద్ :** తెలంగాణలో అర్హులైన పేదలకు కొత్త రేషన్ కార్డులు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ప్రస్తుతం వినియోగిస్తున్న కాగితపు కార్డుల స్థానంలో అత్యాధునిక టెక్నాలజీతో కూడిన ప్లాస్టిక్ - మిగతా 2 లో

# పాకిస్థాన్‌ను చుట్టుముట్టిన ఆర్థిక సంక్షోభం




- కోరలు చాస్తున్న పేదరికం
- పాకిస్థాన్‌లో ప్రమాదకర స్థాయికి చేరిన పేదరికం
- పట్టణాలతో పోలిస్తే గ్రామాల్లోనే ఎక్కువ ప్రభావం
- అధిక ద్రవ్యోల్బణం, ఆర్థిక సంక్షోభాలే ప్రధాన కారణాలు
- వృద్ధి ఫలాలు సంపన్నులకే.. పేదలకు తప్పని కష్టాలు


**ఢిల్లీ :** దాయాది దేశం పాకిస్థాన్‌ను పేదరికం చుట్టుముడుతోంది. గడిచిన ఆరేళ్లలో దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఒడిదొడుకులకు లోనుకావడంతో నిరుపేదల సంఖ్య ప్రమాదకర స్థాయిలో పెరిగిపోయింది. వరుస ఆర్థిక సంక్షోభాలు, అధిక ద్రవ్యోల్బణం, బలహీనమైన వృద్ధి రేటు వంటి కారణాలతో కుటుంబ ఆదాయాలు గణనీయంగా క్షీణించాయి. ఫలితంగా దేశ - మిగతా 2 లో

# రాహుల్ వయసుపై ప్రధాని మోదీ చురకలు



- ప్రైవేట్ రాకెట్ ప్రయోగించిన యువతను ప్రశంసించిన ప్రధాని మోదీ
- రాహుల్ గాంధీ వయసును ఉద్దేశించి పరోక్షంగా సెటైర్లు
- స్కైరూట్ బృందం సగటు వయసు 28 అని వెల్లడి
- తాను మాట్లాడుతోంది 56 ఏళ్ల యువకుడి గురించి కాదన్న ప్రధాని

**ఢిల్లీ :** పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ప్రారంభానికి ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. భారత్‌లో తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన హైదరాబాద్ స్టార్టప్ 'స్కైరూట్ ఏరోస్పేస్'ను అభినందిస్తూనే, రాహుల్ గాంధీ వయసును ఉద్దేశించి ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం పార్లమెంట్ సమావేశాల సందర్భంగా మీడియాతో మాట్లాడిన ప్రధాని, దేశం సాధించిన ఇటీవలి విజయాలను ప్రస్తావించారు. "భారత్ నుంచి తొలి ప్రైవేట్ రాకెట్‌ను ప్రయోగించిన స్కైరూట్ స్టార్టప్ బృందం సగటు వయసు కేవలం 28 ఏళ్లేనని నాకు తెలిసింది. ఇంతటి అతి పిన్న వయస్కులు ఈ ఘనతను సాధించారు. నేను ఇక్కడ 56 ఏళ్ల 'యువకుడి' గురించి - మిగతా 2 లో




## డెంగీపై భారత్‌కు తొలి వ్యాక్సిన్

- 'క్యూడెంగా'కు ఆమోదం!
- భారత్‌లో తొలి డెంగీ వ్యాక్సిన్‌కు ఆమోదం
- నాలుగు రకాల డెంగీ వైరస్‌ల నుంచి రక్షణ
- ప్రయోగాల్లో ఆస్పత్రి చేరికలను 84 శాతం తగ్గించిన వైనం

**ఢిల్లీ :** వర్షాకాలం మొదలైతే డెంగీ భయం వెంటాడటం మనకు కొత్త కాదు. ఏటా వేలాది మంది ఆసుపత్రుల పాలవుతుంటారు. అలాంటి డెంగీ నియంత్రణలో భారత్ కీలక ముందడుగు వేసింది. దేశంలో తొలి డెంగీ - మిగతా 2 లో

## కేంద్రమంత్రి జేపీ నడ్డాతో కాక్రోచ్ జనతా పార్టీ నాయకుల భేటీ



- నీట్ వివాదంపై కేంద్రమంత్రి నడ్డాతో భేటీ
- విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్
- ఢిల్లీలో 'చలో సంసద్' ర్యాలీ... నిరసనకారులపై లాఠీఛార్జ్
- డిమాండ్లు నెరవేరే వరకు ఆందోళనలు కొనసాగుతాయని స్పష్టీకరణ

**ఢిల్లీ :** నీట్-యూజీ 2026 ప్రశ్నాపత్రం లీకేజీతో పాటు పలు పరీక్షల్లో జరిగిన అవకతవకలపై ఆరోపణలు వెల్లువెత్తడంతో ఢిల్లీలో నిరసనలు ఉద్ధృతమయ్యాయి. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో ఆందోళనలు కొనసాగుతున్న నేపథ్యంలో, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేతలు సోమవారం కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో భేటీ అయ్యారు. సీజేపీ ప్రతినిధులు సౌరవ్ దాస్, అశుతోష్ రంకా ఢిల్లీలోని నడ్డా నివాసంలో సుమారు 10 నిమిషాల పాటు సమావేశమై, తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ సమస్యపై అంతర్గతంగా ఉన్నత స్థాయిలో చర్చిస్తామని మంత్రి హామీ ఇచ్చారని, అయితే ఎటువంటి నిర్దిష్ట హామీలు లభించలేదని సౌరవ్ దాస్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు శాంతియుత పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం రోజే సీజేపీ - మిగతా 2 లో



## విద్యార్థులు చదువుకే పరిమితం కాకూడదు

- మంచి సంస్కారం అలవర్చుకోవాలి
- రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత
- విజయనగరంలో ఘనంగా 'షైనింగ్ స్టార్స్' అవార్డుల ప్రదానోత్సవం
- ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత
- ప్రతిభావంతులైన 223 మంది విద్యార్థులకు సత్కారం


**అమరావతి :** "రాష్ట్రంలో విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తోంది. మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో విద్యా వ్యవస్థలో ఎన్నో సానుకూల మార్పులు వస్తున్నాయి" అని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. విజయనగరంలో 'షైనింగ్ స్టార్స్' అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి అనిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆమె ఘనంగా సత్కరించి అభినందించారు. - మిగతా 2 లో

## తల్లీ-బిడ్డ ఎక్స్‌ప్రెస్‌కు
# కొత్త రూపు




- నూతన వాహనాలను పరిశీలించిన సీఎం చంద్రబాబు
- రాష్ట్రవ్యాప్తంగా 500 నూతన వాహనాలతో సేవలు అందించనున్న ప్రభుత్వం
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన బాలింతలకు ఉచిత, సురక్షిత రవాణా
- జీపీఎస్, ఏసీ, సీట్ బెల్టుల వంటి ఆధునిక సౌకర్యాలతో వాహనాల రూపకల్పన
- ఏటా సుమారు 2.75 లక్షల మంది బాలింతలకు ప్రయోజనం చేకూరనున్న అంచనా

## పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల తరహాలో
# రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు




- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- డాక్యుమెంట్ రైటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల వల్ల కలిగే లాభాలను ప్రజలకు చెప్పాలి
- ఆర్టీజీఎస్‌లో వివిధ శాఖలపై సీఎం చంద్రబాబు సమీక్ష
- సబ్-రిజిస్ట్రార్ ఆఫీసుల ప్రైవేటీకరణ వార్తలు అవాస్తవమన్న చంద్రబాబు
- పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల మాదిరిగా రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు అని వివరణ
- దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని అధికారులకు సీఎం ఆదేశం

**అమరావతి :** సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రైవేటీకరిస్తున్నారంటూ కొందరు పని గట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని దీనిపై వాస్తవాలను ప్రజలకు తెలపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలందించేందుకే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని ఆయన వెల్లడించారు. రిజిస్ట్రేషన్ సేవలను మరింత సులభతరం చేసేలా రిజిస్ట్రేషన్ సేవా కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ సెంటర్లో వివిధ శాఖల పనితీరుపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. ప్రజలకు మెరుగైన రిజిస్ట్రేషన్ సేవలందించేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రైవేటీకరిస్తున్నారనే అంశం సమీక్షలో ప్రస్తావనకు వచ్చింది. ఇది ప్రైవేటీకరణ ఎంత మాత్రమూ కాదని స్పష్టంచేశారు. పాస్ పోర్టు సేవా కేంద్రాల తరహాలోనే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు పని చేస్తాయని తెలిపారు. పాస్ పోర్టు సేవా కేంద్రాల పనితీరు ఏ విధంగా జరుగుతుందో, ఆ తర్వాత ప్రక్రియ ఏ విధంగా జరుగుతుందో వివరించాలని సూచించారు. పాస్ పోర్టు సేవా కేంద్రాలు అందుబాటులోకి వచ్చాక పాస్ పోర్టు ప్రాసెసింగ్ అనేది చాలా సులువైందన్న సీఎం, ఇదే తరహాలో రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల పనితీరు ఉంటుందని తెలిపారు. అయితే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల విషయంలో కొందరు పనిగట్టుకుని - మిగతా 2 లో

# సంపాదకీయం

## విక్రమ్-1తో అంతరిక్ష రంగంలో నూతన శకం

(సి.హెచ్.ప్రతాప్)



భారత అంతరిక్ష రంగం మరో చారిత్రక మైలురాయిని చేరుకుంది. ఇటీవల భారతీయ ప్రైవేటు సంస్థ అభివృద్ధి చేసిన విక్రమ్-1 రాకెట్ విజయవంతంగా కక్ష్యలోకి చేరడం దేశ అంతరిక్ష చరిత్రలో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలికింది. ఈ విజయం కేవలం ఒక సంస్థ సాధించిన ఘనత మాత్రమే కాదు; ప్రభుత్వ సంస్థల అనుభవం, శాస్త్రవేత్తల మార్గదర్శకత్వం, యువ పారిశ్రామికవేత్తల సృజనాత్మకత కలిసినప్పుడు భారతదేశం ఎంతటి విజయాలను అందుకోగలదో ప్రపంచానికి చాటిచెప్పింది. హైదరాబాద్ కేంద్రంగా 2018లో స్థాపించబడిన స్కైరూట్ ఏరోస్పేస్ భారత తొలి ప్రైవేటు అంతరిక్ష ప్రయోగ సంస్థగా గుర్తింపు పొందింది. ఇస్రో మాజీ శాస్త్రవేత్తలు పవన్ కుమార్ చందన, నాగ భరత్ డాకా స్థాపించిన ఈ సంస్థ, స్వదేశీ సాంకేతికతతో చిన్న ఉపగ్రహాల ప్రయోగాలకు అనువైన రాకెట్లను అభివృద్ధి చేస్తోంది. విక్రమ్-1 విజయవంతమైన ప్రయోగంతో భారత ప్రైవేటు అంతరిక్ష రంగ సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటుతూ, అంతర్జాతీయ వాణిజ్య అంతరిక్ష సేవల్లో దేశానికి కొత్త అవకాశాల ద్వారాలు తెరిచింది. అంతరిక్ష రంగంలో ప్రైవేటు భాగస్వామ్యం వల్ల ఎన్నో సానుకూల ఫలితాలు కనిపిస్తున్నాయి. వినూత్న సాంకేతికతల అభివృద్ధి వేగవంతమవుతోంది. పరిశోధనలో కొత్త ఆలోచనలు ఆచరణలోకి వస్తున్నాయి. ఉపగ్రహాల రూపకల్పన, ప్రయోగ వాహనాల తయారీ, భూ పరిశీలన, కమ్యూనికేషన్ సేవలు వంటి విభాగాల్లో దేశీయ సంస్థలు ప్రపంచ మార్కెట్‌లో పోటీ పడే సామర్థ్యాన్ని పెంపొందించుకుంటున్నాయి. దీంతో యువ ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు, స్టార్టప్‌లకు విస్తృత అవకాశాలు లభిస్తున్నాయి. ఉపాధి సృష్టితో పాటు విదేశీ పెట్టుబడులు, వాణిజ్య ప్రయోగాల ద్వారా దేశ ఆర్థికాభివృద్ధికీ ఇది తోడ్పడుతుంది. అయితే ప్రతి అవకాశంతో పాటు కొన్ని బాధ్యతలు కూడా వస్తాయి. అంతరిక్ష రంగం అత్యంత సున్నితమైన, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ముడిపడి ఉంటుంది. కాబట్టి భద్రతా ప్రమాణాలు, నాణ్యత నియంత్రణ, పరిశోధనలో పారదర్శకత, అంతర్జాతీయ నిబంధనల పాటింపు వంటి అంశాలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రైవేటు సంస్థలు తక్షణ వాణిజ్య ప్రయోజనాలతో పాటు దేశ దీర్ఘకాల శాస్త్రీయ లక్ష్యాలను కూడా దృష్టిలో ఉంచుకుని ముందుకు సాగాలి. ప్రభుత్వం, ఇస్రో, పరిశ్రమలు, విద్యాసంస్థల మధ్య సమన్వయం మరింత బలపడితే ఈ రంగం మరింత స్థిరంగా ఎదుగుతుంది. భవిష్యత్తులో అంతరిక్ష సాంకేతికత వ్యవసాయం, వాతావరణ అంచనాలు, విపత్తు నిర్వహణ, టెలిమెడిసిన్, విద్య, రక్షణ, కమ్యూనికేషన్ వంటి అనేక రంగాలకు మరింత ఉపయోగపడనుంది. ఈ నేపథ్యంలో ప్రైవేటు భాగస్వామ్యం పరిశోధనను వేగవంతం చేయడమే కాకుండా భారతదేశాన్ని ప్రపంచ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థలో ప్రముఖ స్థానానికి చేర్చగల శక్తిని కలిగి ఉంది. భారతీయ స్టార్టప్‌లకు అంతర్జాతీయ భాగస్వామ్యాలు, సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి, నూతన పెట్టుబడుల అవకాశాలు కూడా మరింత విస్తరిస్తాయి. దీని ద్వారా దేశీయ తయారీ రంగానికి ఊతమిచ్చే బలమైన అంతరిక్ష పారిశ్రామిక వ్యవస్థ ఏర్పడే అవకాశం ఉంది. విక్రమ్-1 విజయం భారత యువతలో కొత్త ఆత్మవిశ్వాసాన్ని నింపింది. ప్రభుత్వ విధానాల ప్రోత్సాహం, ఇస్రో సాంకేతిక వారసత్వం, ప్రైవేటు సంస్థల సృజనాత్మకత కలిసి పనిచేస్తే భారత అంతరిక్ష రంగం మరిన్ని శిఖరాలను అధిరోహించడం ఖాయం. ప్రపంచ అంతరిక్ష రంగంలో వేగంగా మారుతున్న పోటీ పరిస్థితుల్లో నాణ్యత, భద్రత, పరిశోధన, నవకల్పనలకు సమాన ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగితే భారతదేశం వాణిజ్య అంతరిక్ష సేవలలోనూ అగ్రగామిగా నిలిచే అవకాశాలు మరింత పెరుగుతాయి. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం పరస్పర విశ్వాసం, సాంకేతిక నైపుణ్యం, జాతీయ ప్రయోజనాల సమన్వయంతో ముందుకు సాగినప్పుడే "అంతరిక్ష శక్తిగా భారత్" అనే లక్ష్యం మరింత వేగంగా సాకారమవుతుంది.

## రాహుల్ వయసుపై ప్రధాని మోదీ చురకలు

**మొదటిపేజీ తరువాయి -** మాట్లాడటం లేదు... రోదసిలో త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించిన 28 ఏళ్ల యువత గురించి మాట్లాడుతున్నాను" అని మోదీ పేర్కొన్నారు. జూన్ మాసంలో 56వ ఏట అడుగుపెట్టిన రాహుల్ గాంధీని ఉద్దేశించే ప్రధాని ఈ వ్యాఖ్యలు చేసినట్లు స్పష్టమవుతోంది. హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ శనివారం 'విక్రమ్-1' రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన సంగతి తెలిసిందే. ఈ ప్రయోగం ద్వారా అమెరికా, చైనాల తర్వాత ప్రైవేట్ ఆర్బిటల్ ప్రయోగ సామర్థ్యాలను కలిగిన మూడో దేశంగా భారత్ రికార్డు సృష్టించింది. ప్రపంచవ్యాప్తంగా కేవలం కొన్ని దేశాలకు మాత్రమే పరిమితమైన ఈ ఘనతను భారత యువత సాధించడం దేశానికే గర్వకారణమని మోదీ కొనియాడారు. గత ఏడాది వర్షాకాల సమావేశాల కంటే ముందు ఓ భారత పౌరుడు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్న అంశాన్ని కూడా ప్రధాని ఈ సందర్భంగా గుర్తుచేశారు. పార్లమెంట్ సమావేశాలు అర్థవంతంగా, ఫలప్రదంగా సాగాలని, ప్రజా సమస్యలపై లోతైన చర్చలు జరగాలని ఆయన ఆకాంక్షించారు.

## కేంద్రమంత్రి జేపీ నడ్డాతో కాక్రోచ్ జనతా పార్టీ నాయకుల భేటీ

**మొదటిపేజీ తరువాయి -** 'పార్లమెంట్ ముట్టడి'కి పిలుపునివ్వడంతో జంతర్ మంతర్ వద్దకు విద్యార్థులు, యువత భారీగా చేరుకున్నారు. అక్కడి నుంచి పార్లమెంట్ వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన నిరసనకారులను పోలీసులు అడ్డుకున్నారు. నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నప్పటికీ ముందుకు వెళ్లేందుకు యత్నించిన ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు కొన్నిచోట్ల లాఠీఛార్జ్ చేయడంతో పాటు బాష్పవాయువును ప్రయోగించారు. సోషల్ మీడియాలో ఒక వ్యంగ్య ఉద్యమంగా ఆరంభమైన కాక్రోచ్ జనతా పార్టీ, ప్రస్తుతం పరీక్షల లీకేజీలు, సాంకేతిక వైఫల్యాలపై నిరంతరాయంగా పోరాడుతోంది. ఈ ఉద్యమానికి మద్దతుగా పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ సుదీర్ఘ నిరాహార దీక్ష చేపట్టారు. ఆందోళనలు ప్రారంభమైన తర్వాత సీజేపీ నేతలతో కేంద్ర ప్రభుత్వం ఉన్నత స్థాయిలో చర్చలు జరపడం ఇదే ప్రథమం. తమ డిమాండ్లు నెరవేరే వరకు శాంతియుత నిరసనలు కొనసాగిస్తామని సీజేపీ నాయకత్వం తేల్చిచెప్పింది.

## పాకిస్థాన్‌ను చుట్టుముట్టిన ఆర్థిక సంక్షోభం

**మొదటిపేజీ తరువాయి -** జనాభాలో దాదాపు 29 శాతం మంది పేదరిక రేఖకు దిగువన జీవిస్తున్నారని ఒక తాజా నివేదిక వెల్లడించింది. 2018-19లో 21.8 శాతంగా ఉన్న పేదరికం, 2024-25 నాటికి 28.9 శాతానికి చేరింది. అంటే కేవలం ఆరేళ్లలోనే పేదరికం 7 శాతం పెరిగింది. హౌస్‌హోల్డ్ ఇంటిగ్రేటెడ్ ఎకనామిక్ సర్వే (హెచ్ఐఈఎస్), పాకిస్థాన్ సోషల్ అండ్ లివింగ్ స్టాండర్డ్స్ మెజర్‌మెంట్ (పీఎస్ఎల్ఎం) డేటా ఆధారంగా 'డాన్' పత్రిక ఈ విశ్లేషణను ప్రచురించింది. దాదాపు ఆరేళ్ల విరామం తర్వాత విడుదలైన ఈ గణాంకాలు.. దేశం ఎదుర్కొన్న బహుళ సంక్షోభాల ప్రభావాన్ని స్పష్టం చేస్తున్నాయి. పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాలపై ఈ ప్రభావం మరింత తీవ్రంగా ఉంది. గ్రామీణ పాకిస్థాన్‌లో పేదరికం సుమారు 8 శాతం మేర పెరగగా, పట్టణ ప్రాంతాల్లో ఇది 6 శాతంగా నమోదైంది. పదేపదే తలెత్తిన చెల్లింపుల సంక్షోభం, కోవిడ్-19 మహమ్మారి, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, దీర్ఘకాలిక స్థూల ఆర్థిక సర్దుబాట్లు వంటివి ఈ దుస్థితికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. విశ్లేషకులు ఈ పరిస్థితిని జీవన ప్రమాణాల మెరుగుదల విషయంలో 'కోల్పోయిన దశాబ్దం'గా అభివర్ణిస్తున్నారు. గత రెండు సర్వేల మధ్య కాలంలో ద్రవ్యోల్బణాన్ని సర్దుబాటు చేసిన తర్వాత చూస్తే, సగటు కుటుంబ ఆదాయాలు, వినియోగం గణనీయంగా తగ్గినట్లు నివేదిక పేర్కొంది. ఆర్థిక వృద్ధి సానుకూలంగా ఉన్నప్పటికీ, పేదరికం పెరగడం ఆందోళన కలిగించే అంశం. ఈ వృద్ధి ఫలాలు ఎక్కువగా ఉన్నత ఆదాయ వర్గాలకే చేరాయని, దిగువ ఆదాయ వర్గాల వాస్తవ ఆదాయాలు, కొనుగోలు శక్తి తీవ్రంగా దెబ్బతిన్నాయని ఇది సూచిస్తోంది. పేద కుటుంబాలు ఎక్కువగా రోజువారీ వేతనాలపై ఆధారపడతాయి. అధిక ద్రవ్యోల్బణం, ఆర్థిక అంతరాయాల వల్ల ఈ వర్గాలే ఎక్కువగా నష్టపోయాయి. మరోవైపు, సంపన్న వర్గాలు రియల్ ఎస్టేట్, ఆర్థిక పెట్టుబడుల వంటి ఆస్తులను కలిగి ఉండటంతో, ధరల పెరుగుదల ప్రభావాన్ని తట్టుకోగలిగారు. దీంతో దేశంలో ఆదాయ అసమానతలు మరింత పెరిగాయి. ప్రస్తుత భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, బాహ్య ఆర్థికపరమైన రిస్కుల మధ్య, పెరుగుతున్న పేదరికాన్ని, విస్తరిస్తున్న అసమానతలను పరిష్కరిస్తూనే ఆర్థిక వృద్ధిని కొనసాగించడం పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థకు పెను సవాలుగా మారింది.

## కేంద్రంపై సీఎం రేవంత్ రెడ్డి ఫైర్

**మొదటిపేజీ తరువాయి -** ఎల్లప్పుడూ అండగా ఉంటాను" అని తన పోస్ట్‌లో పేర్కొన్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలిరోజైన సోమవారం, కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో విద్యార్థులు 'ఛలో పార్లమెంట్' కార్యక్రమాన్ని చేపట్టారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)లో సమూల సంస్కరణలు తీసుకురావాలని డిమాండ్ చేస్తూ వారు పార్లమెంట్ వైపు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే, అనుమతి లేదంటూ పోలీసులు వారిని అడ్డుకోవడంతో అక్కడ ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీఛార్జ్ చేయడంతో పాటు టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఈ ఘటనలో పలువురు విద్యార్థులకు గాయాలయ్యాయి.

## పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల తరహాలో రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు



**మొదటిపేజీ తరువాయి -** దుష్ప్రచారం చేస్తున్నారని, ప్రజలకు వాస్తవాలు వివరించే బాధ్యతను అధికారులు తీసుకోవాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల వల్ల కలిగే లాభాలను వివరించాలన్నారు. డాక్యుమెంట్ రైటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. డాక్యుమెంట్ రైటర్ల ఉపాధికి ఇబ్బంది లేని విధంగా మార్గాలు చూపెడతామని హామీ ఇచ్చారు. దీపం-2.0 పథక లబ్దిదారులకు ఇచ్చే సబ్సిడీని క్రమపద్ధతిలో ఇవ్వాల్సిన అవసరం ఉందని సీఎం అన్నారు. ఈ సబ్సిడీని నిర్ధారిత తేదీల్లో ఇచ్చే అంశాన్ని పరిశీలించాలన్నారు. ఈ అంశంపై పౌర సరఫరాల శాఖ-ఆర్థిక శాఖ అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. దీనికి సంబంధించిన సాంకేతిక అంశాలను పరిశీలించి అమలు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. లిటిగెంట్ పిటిషనర్లను ఏ విధంగా కట్టడి చేయాలి, ఎలాంటి ప్రజా ప్రయోజనం లేకుండా చేసే ఫిర్యాదు దారులను గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని సీఎం చర్చించారు. రాష్ట్ర వ్యాప్తంగా 81 మంది లిటిగెంట్ పిటిషనర్లు ఉన్నట్టు గుర్తించామన్నారు. వీరు సరాసరి ఒక్కొక్కరు 246 పిటిషన్లు పెడుతున్నారన్నారు. వీరి వివరాలను జిల్లా కలెక్టర్లకు పంపించాలని సూచించారు. వారు పెట్టే అర్జీల్లో ప్రజా ప్రయోజనాలు ఉంటే వాటిని పరిశీలించాలని సూచించారు. ప్రభుత్వాన్ని, అధికారులను బద్నాం చేసే ఉద్దేశంతో పిటిషన్లు పెట్టే వారిని గుర్తించాలన్నారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఆర్థికేతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రాధాన్యతల వారీగా ఆర్థిక సమస్యలను పరిష్కరిద్దామన్నారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం కారణంగా ప్రస్తుతం 49 శాతం లోటు వర్షపాతం ఉంది. ఈ ప్రభావం నుంచి బయటపడేసే ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలన్నారు. ఈ మేరకు రైతుల్లో అవగాహన కల్పించాలని, డ్రై క్రాప్స్ వేసేలా రైతులను ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. వీబీ జీ రామ్ జీ పనులను పెద్ద ఎత్తున చేపట్టాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. జలధార పనులకు వీబీ జీ రామ్ జీ పనుల్ని అనుసంధానం చేయాలన్నారు. ప్రజాభిప్రాయాలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పని విధానం మార్చుకోవాలని, పరిపాలనా విధానాలను మెరుగుపరుచుకోవాలన్నారు. సమస్యలు ఉత్పన్నమయ్యాక చర్యలు తీసుకోవడంతోపాటు ముందుగానే ఏయే సమస్యలు వస్తాయనే విషయాన్ని అంచనా వేసి దానికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

## తల్లీ-బిడ్డ ఎక్స్‌ప్రెస్‌కు కొత్త రూపు

**మొదటిపేజీ తరువాయి -** రాష్ట్రంలో మాతా-శిశు సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం, 'తల్లీ--బిడ్డ ఎక్స్‌ప్రెస్' సేవలను మరింత మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా, గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు సురక్షితమైన, నాణ్యమైన రవాణా సౌకర్యం కల్పించేందుకు సిద్ధం చేసిన 500 నూతన వాహనాలను ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం తన క్యాంపు కార్యాలయంలో పరిశీలించారు. ఈ సందర్భంగా వాహనాల రూపకల్పన, భద్రతా ప్రమాణాలు, ప్రయాణికులకు కల్పించిన సౌకర్యాలను సీఎం క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ముఖ్యంగా తల్లీబిడ్డల అవసరాలకు అనుగుణంగా వాహనాల్లో చేసిన మార్పులను అధికారులు ఆయనకు వివరించారు. ఈ సేవలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించేలా వాహనాలపై రూపొందించిన బ్రాండింగ్ నమూనాలను పరిశీలించి, వాటికి ఆమోదం తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన బాలింతలను, వారి నవజాత శిశువులను, సహాయకులను ఉచితంగా, క్షేమంగా వారి ఇళ్లకు చేర్చడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం. దీంతో పాటు, అధిక రక్తహీనతతో బాధపడే గర్భిణులు, ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న గర్భిణులను వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రులకు తీసుకురావడానికి కూడా ఈ వాహనాలను వినియోగించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 500 వాహనాల/వీటి వాహనాల ద్వారా అందించే ఈ సేవలతో ఏటా సుమారు 2.75 లక్షల మంది బాలింతలు లబ్ధి పొందనున్నారని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ కొత్త వాహనాల్లో ప్రయాణికుల భద్రత, సౌకర్యాలకు పెద్దపీట వేశారు. వెనుక సీట్లలో సైతం సీటు బెల్టులు, బాలింతలు సులభంగా ఎక్కి దిగేందుకు వీలుగా ఫుట్‌రెస్ట్, ఎయిర్ కండిషనింగ్ (ఏసీ), ఫస్ట్ ఎయిడ్ కిట్, అగ్నిమాపక పరికరాలు వంటివి ఏర్పాటు చేశారు. ప్రతి వాహనానికి జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థను అనుసంధానించడం ద్వారా వాటి కదలికలను రియల్ టైమ్‌లో పర్యవేక్షించనున్నారు. వాహనాలపై అధికారిక స్టిక్కరింగ్ పూర్తి చేసి, త్వరలోనే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఈ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య-కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి వీరపాండ్యన్, జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) అధికారులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువుకే పరిమితం కాకూడదు

**మొదటిపేజీ తరువాయి -** కూటమి ప్రభుత్వం విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం అనేక చర్యలు చేపడుతోంది. ప్రతిభావంతులను ప్రోత్సహించాలనే సత్సంకల్పంతో అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా గత రెండేళ్లుగా 'షైనింగ్ స్టార్స్' పేరుతో అవార్డులను ప్రదానం చేస్తోంది. ఈ కార్యక్రమంలో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన 184 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. అలాగే ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మరో 39 మంది విద్యార్థులను గుర్తించారు. వీరందరికీ మంత్రి అనిత చేతుల మీదుగా అవార్డులను అందజేశారు. ప్రతి విద్యార్థికి ఒక మెడల్, మెరిట్ సర్టిఫికెట్ ఇచ్చారు. వీటితో పాటు ప్రోత్సాహకంగా రూ.20 వేల నగదును బహుకరించారు. ఈ సందర్భంగా మంత్రి వంగలపూడి అనిత విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. విజయనగరం అంటేనే విజ్ఞాన నగరమని ఆమె కీర్తించారు. ఈ గడ్డ ఎన్నో అద్భుత చరిత్రలను సృష్టించిందని గుర్తుచేశారు. విద్యార్థులు ఇక్కడి నుంచి స్ఫూర్తి పొందాలన్నారు. ప్రతి ఒక్కరూ భవిష్యత్తుపై ఒక నిర్దిష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని సూచించారు. సమయాన్ని ఏమాత్రం వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. విలువలతో కూడిన విద్యను అభ్యసించడం ఎంతో అవసరమని చెప్పారు. విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకూడదన్నారు. చదువుతో పాటు మంచి సంస్కారం కూడా అలవర్చుకోవాలని హితవు పలికారు. తల్లిదండ్రుల కష్టాన్ని పిల్లలు ఎప్పటికీ మర్చిపోకూడదని మంత్రి కోరారు. ఎన్నో త్యాగాలు చేసి వారు తమ పిల్లలను చదివిస్తున్నారని గుర్తుచేశారు. వారి కష్టాన్ని వృథా చేయకుండా చూసుకోవాల్సిన బాధ్యత విద్యార్థులదే అన్నారు. కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అప్పుడే తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు వస్తుందన్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నిర్ణయాలను ఆమె కొనియాడారు. విద్యారంగంలో ఆయన ఎన్నో మార్పులు తీసుకువస్తున్నారని చెప్పారు. విద్యార్థుల కోసం ప్రభుత్వ పాఠశాలల్లో సకల వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి పైనా మంత్రి అనిత కీలక వ్యాఖ్యలు చేశారు. రాబోయే రోజుల్లో ఉత్తరాంధ్రలో భారీగా పరిశ్రమలు రాబోతున్నాయని వెల్లడించారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఈ ప్రాంత సమగ్రాభివృద్ధికి ఎంతో దోహదం చేస్తాయన్నారు. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. విజయనగరం జిల్లా కలెక్టర్ రాంసుందర్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యేలు అదితి విజయలక్ష్మి గజపతిరాజు, లోకం మాధవి హాజరయ్యారు. వీరితో పాటు మార్క్‌ఫెడ్ ఛైర్మన్ బంగారు రాజు, డీసీఎంఎస్ ఛైర్మన్ గొంప కృష్ణ, తూర్పు కాపు అభివృద్ధి సంక్షేమ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పాలవలస యశస్వి తదితరులు పాల్గొన్నారు. "విజయనగరం అంటేనే ఒక విజ్ఞాన నగరం. ఈ గడ్డ ఎన్నో చరిత్రలు సృష్టించిన గడ్డ. నేటి విద్యార్థులు ఇక్కడి నుంచి ఎంతో స్ఫూర్తి పొందాలి. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యారంగంలో ఎన్నో అద్భుతమైన మార్పులు తీసుకువస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నాం. ఉత్తరాంధ్రలో పెద్ద సంఖ్యలో పరిశ్రమలు కూడా రాబోతున్నాయి. విద్యార్థులు తమ సమయాన్ని వృథా చేసుకోకుండా సద్వినియోగం చేసుకోవాలి.

## డెంగీపై భారత్‌కు తొలి వ్యాక్సిన్

**మొదటిపేజీ తరువాయి -** వ్యాక్సిన్‌గా జపాన్‌కు చెందిన టకెడా కంపెనీ రూపొందించిన 'క్యూడెంగా'కు 'కేంద్ర ఔషధ ప్రమాణాల నియంత్రణ సంస్థ (సీడీఎస్‌సీఓ) ఆమోదం తెలిపింది. దీంతో డెంగీ నివారణలో భారత్‌కు మరో కీలక ఆయుధం అందుబాటులోకి రానుంది. భారత్‌లో గత రెండు దశాబ్దాలుగా డెంగీ కేసులు వేగంగా పెరుగు తున్నాయి. పట్టణీకరణ, వాతావరణ మార్పులు, దోమల వ్యాప్తికి అనుకూల పరిస్థితులు, జనాభా పెరుగుదల ఇందుకు ప్రధాన కారణాలుగా నిపుణులు చెబుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా నమోదవుతున్న డెంగీ కేసుల్లో దాదాపు మూడో వంతు భారత్‌లోనే ఉంటాయని అంచనా. ముఖ్యంగా వర్షాకాలం, ఆ తర్వాతి నెలల్లో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులపై తీవ్ర ఒత్తిడి పడుతోంది. క్యూడెంగా (టీఏకే-003)ను జపాన్‌కు చెందిన ఔషధ సంస్థ టకెడా అభివృద్ధి చేసింది. ఇది లైవ్ అటెన్యుయేటెడ్ టెట్రావాలెంట్ వ్యాక్సిన్. అంటే డెంగీ వైరస్‌లోని నాలుగు రకాలైన డెన్‌వీ-1, డెన్‌వీ-2, డెన్‌వీ-3, డెన్‌వీ-4పై రోగనిరోధక శక్తిని పెంచేలా రూపొందించారు. ఈ వ్యాక్సిన్‌ను మూడు నెలల వ్యవధిలో రెండు డోసులుగా ఇస్తారు. చర్మం కింద ఇంజెక్షన్ రూపంలో వేస్తారు. డెంగీ అధికంగా ఉన్న దేశాల్లో సమగ్ర నియంత్రణ వ్యూహంలో భాగంగా దీన్ని వినియోగించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ఇప్పటికే సూచించింది. ఈ వ్యాక్సిన్‌కు మరో ప్రత్యేకత కూడా ఉంది. గతంలో అందుబాటులో ఉన్న డెంగ్‌వాక్సియా వ్యాక్సిన్ తీసుకునే ముందు వ్యక్తికి ఇప్పటికే డెంగీ సోకిందో లేదో రక్త పరీక్ష చేయాల్సి వచ్చేది. అలాంటి అవసరం క్యూడెంగాకు లేదు. డెంగీ వచ్చినా, రాకపోయినా ఈ వ్యాక్సిన్ ఇవ్వొచ్చు. దీంతో సామూహిక టీకా కార్యక్రమాలను సులభంగా నిర్వహించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం యూరోపియన్ యూనియన్, బ్రిటన్, బ్రెజిల్, ఇండోనేషియా, అర్జెంటీనా సహా 40కిపైగా దేశాల్లో ఈ వ్యాక్సిన్‌కు అనుమతులు లభించాయి. ఇప్పుడు ఆ జాబితాలో భారత్ కూడా చేరింది. క్యూడెంగా ప్రభావంపై నిర్వహించిన టైడ్స్ ఫేజ్-3 క్లినికల్ అధ్యయనంలో 20 వేల మందికిపైగా పిల్లలు, యువత పాల్గొన్నారు. సుమారు నాలుగున్నరేళ్ల పరిశీలనలో ఆసుపత్రిలో చేరే పరిస్థితిని 84 శాతం వరకు తగ్గించినట్లు గుర్తించారు. ప్రయోగశాల పరీక్షల్లో నిర్ధారిత డెంగీ కేసులపై దాదాపు 61 శాతం రక్షణ కల్పించినట్లు వెల్లడైంది. గతంలో సోకిన వారికైనా, సోకని వారికైనా తీవ్రమైన డెంగీ ప్రమాదాన్ని తగ్గించడంలో మంచి ఫలితాలు కనిపించాయి. వైరస్ రకాన్ని బట్టి ప్రభావంలో కొంత తేడా ఉన్నప్పటికీ మొత్తం ఫలితాలు ఆశాజనకంగా ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. భారత్‌లో ఈ వ్యాక్సిన్ ధరను ఇంకా ప్రకటించలేదు. అయితే హైదరాబాద్‌కు చెందిన 'బయోలాజికల్-ఈ'తో టకెడా ఇప్పటికే ఉత్పత్తి ఒప్పందం కుదుర్చుకుంది. ఏడాదికి ఐదు కోట్ల డోసులు తయారు చేసే సామర్థ్యాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. దేశీయంగా తయారీ ప్రారంభమైతే ధరలు తగ్గే అవకాశముందని భావిస్తున్నారు. మొదట ప్రైవేటు ఆసుపత్రుల్లో అందుబాటులోకి వస్తుందా, లేక ప్రభుత్వ టీకా కార్యక్రమంలో చేర్చుతారా అన్న విషయంపై త్వరలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## తెలంగాణలో క్యూఆర్ కోడ్‌తో కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు

**మొదటిపేజీ తరువాయి -** స్మార్ట్ కార్డులను పంపిణీ చేయనుంది. వారం రోజుల్లోనే ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి ప్రారంభించేందుకు పౌరసరఫరాల శాఖ ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. హైదరాబాద్‌లో జరిగే ప్రధాన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పీవీసీ స్మార్ట్ కార్డుల రూపంలో రేషన్ కార్డులు ఇవ్వడం ఇదే తొలిసారి. ప్రస్తుతం లబ్ధిదారులు వాడుతున్న ఏ4 సైజు కాగితపు కార్డులు త్వరగా చిరిగిపోవడం, పాడైపోతుండటంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కొత్తగా అందించే స్మార్ట్ కార్డులపై లబ్ధిదారుడి వివరాలతో పాటు ప్రత్యేకమైన క్యూఆర్ కోడ్, ఆహార భద్రతా కార్డు నంబర్‌ను ముద్రించారు. భద్రతా ఫీచర్లతో పాటు సీఎం రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫొటోలు కూడా ఉంటాయి. ఈ స్మార్ట్ కార్డుల ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థలో మరింత పారదర్శకత వస్తుందని అధికారులు విశ్వసిస్తున్నారు. రాజధానిలో సీఎం కార్యక్రమాన్ని ప్రారంభిస్తుండగా, అదే సమయంలో రాష్ట్రంలోని మొత్తం 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల చేతుల మీదుగా లబ్ధిదారులకు కొత్త కార్డులు అందజేయనున్నారు. ఈ బృహత్తర కార్యక్రమం కోసం పౌరసరఫరాల శాఖ సమగ్ర ప్రణాళికను రూపొందించింది.

### ఒకేసారి మూడు నెలల బియ్యం

ఇదిలాఉంటే.. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పేదలకు ఇబ్బంది కలగకుండా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయనుంది. ఆగస్టు 1 నుంచి నెల రోజుల పాటు రేషన్ దుకాణాలు తెరిచి ఉంటాయి. లబ్ధిదారులు మూడుసార్లు వేలిముద్రలు వేసి తమ కోటాను పొందవచ్చు. అయితే, ఈసారి రేషన్ సరుకులు పొందాలంటే ఈ-కేవైసీ తప్పనిసరి అని అధికారులు స్పష్టం చేశారు. ఈ-కేవైసీ పూర్తి చేసుకునేందుకు జులై 31ని ఆఖరి తేదీగా నిర్ణయించారు. ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు కూడా తమకు దగ్గరలోని రేషన్ దుకాణంలో ఈ-కేవైసీ పూర్తి చేసుకోవచ్చని అధికారులు సూచించారు. గడువులోగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోని వారికి రేషన్ సరుకులు అందవని స్పష్టం చేశారు.

## ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా ఉంది



**మొదటిపేజీ తరువాయి -** ఎదుర్కోవాల్సిన చర్యలపై నల్గొండ కలెక్టరేట్‌లో సూర్యాపేట, నల్గొండ, యాదాద్రి భువనగిరి జిల్లాలకు చెందిన అధికారులతో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌లు సమీక్ష నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా ఉందని వివరించారు. రైతులు వరి పంట వేస్తే ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని, ఈ విషయంపై అన్నదాతలకు అవగాహన కల్పించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో నీళ్లు లేవని వర్షాలు కూడా తక్కువేనని మంత్రులు తెలిపారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు అన్నదాతలు మొగ్గు చూపాలని సూచించారు. తక్కువ నీరు అవసరమయ్యే అరుతడి పంటలు వేసుకోవాలని దీనిపై రైతులకు దిశానిర్దేశం చేయాలని అధికారులకు సూచించారు. ఎల్‌నినో పరిస్థితులకు తగ్గట్టుగా ఉమ్మడి నల్గొండ జిల్లా సిద్ధం కావాలన్నారు. "ఇప్పుడున్న పరిస్థితుల్లో వరి పండించేందుకు తగినంత నీళ్లు లేవు. భవిష్యత్‌లో వర్షాలు పడతాయనే నమ్మి రైతులు వరి పంట వేసినట్లయితే ఇబ్బందులు ఎదరయ్యే అవకాశం ఉంది. ఇవాళ్టి వరకు ఉన్న పరిస్థితుల ప్రకారం, పడ్డ వర్షాలు, రిజర్వాయర్లలో నీటి మట్టాలు పరిశీలించినట్లయితే వరి పండించడం చాలా కష్టసాధ్యమనే విషయాన్ని మూడు జిల్లాలకు చెందిన అధికారులు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి. దీని తీవ్రతను రైతులకు వివరించాలన్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇటీవల జరిగిన కేబినెట్ భేటీ ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సీఎం రేవంత్ రెడ్డి మంత్రులతో సమీక్షించారు. ఎల్‌నినో ప్రభావంపై కేంద్రానికి నివేదిక ఇవ్వాలని కూడా నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు జిల్లా కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు ఇటీవల సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తీసుకోవాల్సిన చర్యలపై ఆయన అధికారులకు ఇప్పటికే దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ప్రత్యామ్నాయ పంటలవైపు రైతులను మళ్లించే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన సూచించిన విషయం తెలిసిందే. ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా ఆరు తడి పంటలు వేయాలని నిపుణులు సూచిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వరి, పత్తి వైపు వెళ్లకుండా సజ్జ, జొన్న, రాగి, వరిగలు, కంది, పెసర, మినుము, వేరుశనగ వంటి వాటితో పాటు ఆవాలు, టమాట, సోర, వంగ, బీర, దోస, కాకర వంటి కూరగాయలు సాగు చేసుకోవాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ఆరుతడి పంటలు వేయాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నా రైతుల్లో స్పందన లేదు. వరి సాగుచేసిన భూముల్లో ముఖ్యంగా నల్లరేగడి నేలలో ఇతర పంటల సాగుకు యోగ్యంకాదని రైతులు చెబుతున్నారు. సన్నరకాల వరి పండించేందుకు కర్షకులు మొగ్గు చూపుతున్నారు. వరి తర్వాత అధికంగా పత్తిని రైతులు సాగుచేసేవారు. రెండు లక్షల సాధారణ సాగు విస్తీర్ణానికి ప్రస్తుతం లక్షఎకరాల్లో వేశారు. భవిష్యత్‌లో వర్షాభావ పరిస్థితులు తీవ్రమైతే రైతులు నష్టపోయే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

Since 2004
పిడికిలి
The Peoples Paper
శనివారం 18 - 07 - 2026

# ఫలహార బండి ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



**తెలంగాణ :** బి.ఎన్. రెడ్డి.నగర్ డివిజన్ పరిధిలోని మెడికల్ అండ్ హెల్త్ కాలనీలో నిర్వ హించిన ఫలహార బండి ఊరేగింపు కార్యక్రమంలో ఎల్.బి. నగర్ శాసనసభ్యులు శ్రీ.దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, కాలనీ ప్రతినిధులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఫలహార బండి ఊరేగింపులో పాల్గొని భక్తులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలంతా సుఖశాంతులు,ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు చింతల రవికుమార్,నిర్వాహకులు అఖిలేష్ గౌడ్,సుజనా,కాలనీ సభ్యులు,నాయకులు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భువనగిరి లో ఎస్సీ బాలికల వసతి గృహ భవనం నిర్మించాలని కలెక్టర్ కు వినతి





**తెలంగాణ :** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలోని ఖాజీమహళ్ళ లో ఎస్సీ బాలికల వసతి గృహం కొరకు నూతన భవనాన్ని వెంటనే నిర్మించాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక నాయకులు కొడారి వెంకటేష్ సోమవారం కలెక్టరేట్ లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ట్రేనీ కలెక్టర్ "కృతిక" కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కొడారి వెంకటేష్ మాట్లాడుతూ భువనగిరి పట్టణంలో సర్వే నెంబర్ 6 లో సుమారు ఒక ఎకరం విస్తీర్ణంలో గతంలో ఎస్సీ బాలికల వసతి గృహం ఉండేదని, అది శిథిలావస్థకు చేరుకోవడంతో భవనం నిరుపయోగంగా ఉందని ఆయన అన్నారు. సుమారు 500 మంది బాలికలు ఉండేందుకు అనువుగా ఉన్న భవనం స్థలాన్ని కొందరు కబ్జా దారులు కబ్జా చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని ఆయన తెలిపారు. ప్రభుత్వం వెంటనే అట్టి స్థలంలో ఎస్సీ బాలికలకు వసతి గృహం నిర్మాణం చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఎస్సీ బాలికల వసతి గృహం అద్దె భవనంలో కొనసాగుతుందని, ప్రభుత్వం అద్దె రూపంలో నెలకు యాభై వేల రూపాయల చెల్లిస్తుందని ఆయన అన్నారు. జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని నూతన భవన నిర్మాణానికి కృషి చేయాలని వెంకటేష్ కోరారు.

# రోటరీ క్లబ్ ఆఫ్ భద్రాచలం 39వ నూతన అధ్యక్షుడిగా షేక్ అజీమ్ ఏకగ్రీవ ఎన్నిక




**తెలంగాణ :** భద్రాచలం పట్టణ కేంద్రంలో, సోమవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో, రోటరీ క్లబ్ ఆఫ్ భద్రాచలం ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు,ఈ సందర్భంగా, రోటరీ క్లబ్ ఆఫ్ భద్రాచలం 39 వ నూతన అధ్యక్షుడిగా,షేక్ అజీమ్,ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం రోటరీ క్లబ్ ఆఫ్ కార్యదర్శి గా శ్రీనాథ్ రాజేష్ కోశాధికారి గా రామకృష్ణ, తో పాటు, ఇన్స్టాలేషన్ ఆఫీసర్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ శివ నారాయణ ప్రమాణం, చేయించారు. ఈ,కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐటిసి యూనిట్ హెడ్ శైలేందర్ సింగ్, ప్రముఖ కాంట్రాక్టర్, విశిష్ట అతిథిగా పాకాల దుర్గా ప్రసాద్, నూతన సభ్యుల తో ప్రమాణ స్వీకారోత్సవ ఆఫీసర్ గా అసిస్టెంట్ గవర్నర్ వెంకటరెడ్డి, వ్యవహరించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి, నూతన అధ్యక్షుడు షేక్ అజీమ్ మాట్లాడుతూ, ఈ సంవత్సరం జిల్లా గవర్నర్ సహకారంతో పేర్మినెంట్ ప్రాజెక్ట్స్ చేస్తాను అని తెలిపారు .ఈ ,కార్య క్రమంలో. మాజీ అధ్యక్షురాలు వరలక్ష్మి,మాజీ కార్యదర్శి బాల కృష్ణ మహేంద్ర,హరి ప్రసన్న కుమార్,ప్రెసిడెంట్ ఎలెక్ట్ పలివెల రవికుమార్, ప్రోగ్రామ్ చైర్మన్ పాస్ట్ ప్రెసిడెంట్ ప్రభాకర్ గుప్తా,యశోద, రాంబాబు, వీరయ్య, అజయ్,కుమార్, నాగేశ్వరరావు, మునికేసావ, రావు, శ్రీ,మహాలక్ష్మి, వసంతరావు, మధు, చైతన్య, డా.సోమయ్య,మరియు, సభ్యులు, చలపతి, సాగర్, శ్రీనివాసరావు,మోహన,కృష్ణ, గ్లాడ్,స్టోన్, నరసింహారావు, శ్రీధర్ రెడ్డి,వంద వాసు తదితరులు పాల్గొన్నారు.

## చేనేత సహకార సంఘం నూతన కార్యవర్గ పదవీ బాధ్యతల స్వీకరణ మహోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**తెలంగాణ :** యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి పట్టణంలోని బాలాజీ గార్డెన్స్‌లో నిర్వహించిన పోచంపల్లి చేనేత సహకార సంఘం నూతన కార్యవర్గ పదవీ బాధ్యతల స్వీకరణ మహోత్సవంలో భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంతకు ముందు పట్టణ కేంద్రంలోని తెలంగాణ ఉద్యమ ప్రముఖుడు, పద్మశ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ గారి విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పోచంపల్లి చేనేత సహకార సంఘం నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన భారత లవకుమార్ తో పాటు నూతన కార్యవర్గ సభ్యులకు ఎమ్మెల్యే హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పోచంపల్లి చేనేతకు ప్రపంచవ్యాప్తంగా విశిష్టమైన గుర్తింపు ఉందని, ఈ ఖ్యాతిని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమం, చేనేత పరిశ్రమ అభివృద్ధి, మార్కెటింగ్ సౌకర్యాల విస్తరణకు కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. చేనేత రంగం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్న ఆయన, నూతన కార్యవర్గం చేనేత కార్మికుల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తూ సంఘాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షించారు. పోచంపల్లి చేనేత ఖ్యాతిని ప్రపంచ స్థాయిలో మరింత విస్తరించేందుకు ప్రభుత్వం, చేనేత కార్మికులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పోచంపల్లి పట్టణ, మండల, గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, చేనేత కార్మికులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ సహకార సంఘాల ప్రతినిధులు, తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

## ఘనంగా బూడిద బిక్షమయ్య గౌడ్ జన్మదిన వేడుకలు



**తెలంగాణ :** తుర్కపల్లి మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్యగౌడ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పిన్నపురెడ్డి నరేందర్ రెడ్డి, మండల సెక్రెటరీ జనరల్ సాగర్ల పరమేష్ యాదవ్, పిఎసిఎస్ మాజీ చైర్మన్ సింగిరెడ్డి నరసింహారెడ్డి ,మాజీ ఎంపీపీలు బబ్బురి రవీంద్రనాథ్ గౌడ్ ,భూక్య సుశీల రవీందర్ నాయక్, సర్పంచులు పుట్ట సాయిలు , సీత రాజు, మోతీరాం నాయక్, గుగులోతు బద్దు నాయక్, మాజీ ఎంపిటీసీ గిద్దె కరుణాకర్, మాజీ సర్పంచులు పోగుల ఆంజనేయులు, బిచ్చు నాయక్, రామోజీ నాయక్, గుంటి శ్రీశైలం, హరినాయక్, నాంసాని సత్యనారాయణ, కల్లూరి ప్రభాకర్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి ,సీత నారాయణ, ఎల్లేష్ ,సురేష్ నాయక్, గ్రామ శాఖ అధ్యక్షుడు బోయిని సత్తయ్య, నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# బాధ్యులైన అటవీ శాఖ అధికారులను సస్పెండ్ చేయాలి

**లేనిపక్షంలో అటవీ శాఖ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరిక**

**రేణుక అక్షర మహిళా మండలి, సభ్యురాలు డిమాండ్**



**తెలంగాణ :** అశ్వాపురం,మండల, పరిధిలోని, మనుబోతుల గూడెం, గ్రామపంచాయతీ, వేములూరు, గ్రామాలలో, చతిస్ గడ్ రాష్ట్రం, నుండి, తెలంగాణకు వలస వచ్చి, మనుబోతుల గూడెంలో సుమారు 30 సంవత్సరాల నుండి, వలస గిరిజనులు పోడు భూములు సేద్యం చేసుకుంటూ, వారు సాగు చేసుకుంటున్నా భూమలపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారు. శుక్రవారం, అక్కడ నివాసం ఉంటున్న వలస ఆదివాసి,ప్రజల,తో ఫారెస్ట్ అధికారుల, మధ్య జరిగిన ఘటన విషయంలో, పోడు భూముల వివాదం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. గిరిజన రైతులకు జీవనాధారమైన పోడు భూముల్లో పత్తి విత్తనాలు వేస్తున్న గిరిజన రైతులను అటవీ శాఖ సిబ్బంది అడ్డుకోవడంతో పరిస్థితి ఒక్కసారిగా వేడెక్కింది. ఈ క్రమంలో అటవీ సిబ్బందికి, గిరిజన రైతులకు మధ్య తీవ్ర తోపులాట చోటుచేసుకుంది. కొందరు ఫారెస్ట్ అధికారులు గిరిజన మహిళలు అని చూడకుండా వారిని కొట్టడం తరమడం వారిపై దురుసుగా ప్రవర్తించడం అమానుషంగా మహిళలపై దాడి చేసి, మహిళలను నేలపై తోసి వేసి, వారిని అటవీ శాఖ అధికారులు బలవంతంగా ఈడ్చివేసినట్లు కనిపిస్తున్న దృశ్యాలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గాని జిల్లావ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా, మారింది. గిరిజనులు, తెలిపిన, వివరాల,ప్రకారం.. తరతరాలుగా, తాము సాగు చేసుకుంటున్న భూముల్లో వ్యవసాయ పనులు చేసు కుంటుండగా ఫారెస్ట్ అధికారులు వచ్చి అడ్డుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మా భూములు లాక్కోవద్దని అధికారులను కాళ్ల పట్టి వేడుకున్నా గాని కనీసం కనికరించలేదని, కన్నీరు, మున్నీరవుతూ ,తెలిపిన గిరిజన మహిళలపై, అటవీ శాఖ అధికారులు, గిరిజనులపై దురుసుగా ప్రవర్తించడమే కాకుండా బలప్రయోగానికి దిగి దాడులు చేశారని, వారు ఆరోపించారు. ఈ ఘటన గిరిజన సమాజంలో తీవ్ర ఆగ్రహజ్వాలలను రగిలించింది. పోడు భూముల్లో గిరిజన మహిళలపై జరిగిన ఈ ఘటనను మణుగూరు, మండల 'రేణుక అక్షర మహిళా మండలి' తీవ్రంగా ఖండించింది. గిరిజన మహిళలపై దురుసుగా ప్రవర్తించి, భౌతిక దాడులకు పాల్పడిన అటవీ శాఖ అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని, వారిపై, ప్రభుత్వ ఉన్న తాధికారులు,శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించి న్యాయం చేయాలని కోరుతూ భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ కు అధికారికంగా, ఫిర్యాదు,లేఖ,సమర్పించనున్నట్లు మండలి నాయకులు వెల్లడించారు. గిరిజన మహిళల ఆత్మగౌరవాన్ని అవమానించే చర్యలను ఎంతమాత్రం సహించబోము. బాధ్యులైన అధికారు లను వెంటనే సస్పెండ్ చేయాలి. ప్రభుత్వం స్పందించక పోతే అటవీ శాఖ కార్యాలయాన్ని ముట్టడించి ఆందోళనను ఉద్ధృతం చేస్తాం. గిరిజన మహిళలపై చేయి వేసిన వారిని వదిలిపెట్టేది లేదు అని రేణుక అక్షర మహిళా మండలి, స్పష్టం చేశారు. గిరిజన మహిళల హక్కులు, ఆత్మగౌరవ పరిరక్షణ కోసం ప్రతి గిరిజన మహిళ ఏకమై ఐక్య పోరాటానికి సిద్ధం కావాలని రేణుక అక్షర మహిళా మండలి పిలుపునిచ్చింది. గిరిజనులపై ఎలాంటి దాడులు జరిగినా చూస్తూ ఊరుకోమని, అవసరమైతే జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో రేణుక అక్షర మహిళా,మండలి,అధ్యక్షురాలు పూనెం సరోజ, మహిళా మండలి సభ్యురాలు ఎండి. షబానా, కోరి శ్యామల, కన్నాపురం వసంత, రెడ్డిబోయిన రేణుక, దేరంగుల సుజాత, కన్నాపురం శైలజ, బాడిష, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

# రవీంద్రభారతిలో ఘనంగా పాలడుగు నాగయ్య జయంతి వేడుకలు

**ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డికి పాలడుగు నాగయ్య జానపద సాహిత్య పురస్కారం ప్రదానం**





**తెలంగాణ :** తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ మరియు పాలడుగు నాగయ్య కళాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం రవీంద్రభారతిలో పాలడుగు నాగయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ జానపద సాహితీవేత్త ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డికి "పాలడుగు నాగయ్య జానపద సాహిత్య పురస్కారం"ను ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, సభాధ్యక్షులు శ్రీ రామకృష్ణ చంద్రమౌళి, విశిష్ట అతిథులు డాక్టర్ జి.బి. రాజు, ఇంద్రవెల్లి రమేష్, ఆత్మీయ అతిథులు గంట మనోహర్ రెడ్డి, అర్ధ చంద్రప్రకాశ్ రెడ్డి, రాధాకృష్ణ పాల్గొన్నారు. సభను శ్రీమతి పాలడుగు సరోజినీ దేవి నిర్వహించగా, పి. బడే సాబ్ సమన్వయం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతూ, తన తండ్రి పాలడుగు నాగయ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ, ఆయన రచించిన బుర్రకథలు, హరికథలు, కవితలు, వ్యాసాలను సమగ్రంగా సంకలనం చేసి "పాలడుగు నాగయ్య సమగ్ర సాహిత్యం" గ్రంథంగా తీసుకురావడం అభినందనీయమని అన్నారు. ఒక గొప్ప రచయితను నేటి తరానికి, సమాజానికి పరిచయం చేసిన శ్రీమతి పాలడుగు సరోజినీ దేవిని ప్రత్యేకంగా అభినందించారు. నాగయ్య పేరిట అందిస్తున్న సాహిత్య పురస్కారం ప్రతిష్ఠాత్మకమైనదని, ఆ పురస్కారాన్ని ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి అందుకోవడం ద్వారా మరింత గౌరవం పెరిగిందని పేర్కొన్నారు. విశిష్ట అతిథి డాక్టర్ జి.బి. రాజు మాట్లాడుతూ, పాలడుగు నాగయ్యతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తాను ఆల్ ఇండియా రేడియోలో పనిచేస్తున్న సమయంలో నాగయ్యకు అంబేద్కర్‌పై బుర్రకథ చెప్పేందుకు అవకాశం కల్పించిన విషయాన్ని స్మరించుకున్నారు. ఉపాధ్యాయు నిగా విధులు నిర్వహిస్తూనే జానపద కళారూపాల ద్వారా ప్రజల్లో చైతన్యం నింపిన మహోన్నత వ్యక్తి నాగయ్య అని కొనియాడారు. ఆయన చిన్న వయసులోనే మరణించడం దురదృష్టకరమని, ఆయన ఆశయాలను కుమార్తె శ్రీమతి పాలడుగు సరోజినీ దేవి ముందుకు తీసుకెళ్తుండడం నేటి సమాజానికి ఆదర్శమని అన్నారు. పురస్కార గ్రహీత ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ, పాలడుగు నాగయ్య పేరుతో ఏర్పాటు చేసిన ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం తనకు లభించడం ఎంతో గౌరవంగా భావిస్తున్నానని తెలిపారు. తనను ఎంపిక చేసిన నిర్వాహకులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. తాను కూడా హరికథలు, బుర్రకథల ద్వారా ప్రజల్లో చైతన్యం కలిగించే ప్రయత్నం చేశానని, ఈ పురస్కారం తనపై మరింత బాధ్యతను పెంచిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సాహితీవేత్తలు, కళాకారులు, రచయితలు, జానపద కళాభిమానులు, సామాజికవేత్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని పాలడుగు నాగయ్యకు ఘనంగా నివాళు లర్పించారు.

# పోడు భూములు సర్వే చేస్తామని చెప్పిన ఐటీడీఏ అధికారి ఇచ్చిన మాట ఏమైంది?

**సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ ఆరోపణ**



**తెలంగాణ :** భద్రాచలం పట్టణంలోని ఐటిడిఏ కార్యాలయం నందు సిపిఐ ఎంఎల్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఐటీడీఏ ద్వారా పిఓ, సాగులో ఉన్న భూములను సర్వేలు, చేపిస్తామని చెప్పి, ఇంతవరకు,సర్వేలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తే ఈ ఉద్యమం ఆగదు. సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, ఆగ్రహం వ్యక్తం చేస్తూ, తాతల ముత్తాతల నుండి చర్ల మండలం కొయ్యూరు దేవరపల్లి మామిడిగూడెం, గిరిజన ఆదివాసీ ప్రజలు అట్లాగే దుమ్ముగూడెం మండలం గడ్డరిగట్టు గ్రామ ఆదివాసీ గిరిజన సాగులో ఉన్న భూములకు వెళ్లి సాగు చేస్తుంటే పారెస్ట్ అధికారులు దాడులు చేస్తున్నారు ఫారెస్ట్ వారిపై చర్యలు తీసుకోకుండా మరో పక్క పిఓ ఇచ్చిన ఆర్ ఎఫ్ ఓ ఆర్ పట్టాలు కాగితాలు ఫేక్ అంటూ అవహేళనగా మాట్లాడుతున్న ఫారెస్ట్ వాళ్ళ పై చర్యలు తీసుకోకుండా గతవారం నిర్వహించిన ధర్నాకు పిఓ రాహుల్ రైతులు పార్టీ అధికారుల సమక్షంలో సమావేశం నిర్వహించి ఈ వారంలో సర్వే చేస్తామని చెప్పి తేదీలు వారాలు మొత్తం నిర్ణయించి తప్పించుకొని తిరగడంలో పిఓ గారు అంతర్వేమిటో అర్థం కావడం లేదని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ భద్రాచలం డివిజన్ కార్యదర్శి కామ్రేడ్ ముసలి సతీష్ అన్నారు. ఫారెస్ట్ వారు పిసా యాక్ట్ ను అటవీ హక్కుల చట్టాన్ని ఉల్లంఘించి గ్రామాలలో కొచ్చి ఎలాంటి తీర్మానాలు లేకుండా ఆదివాసీలు సాగు చేసుకుంటున్న భూములలోకి వచ్చి ఇవి మా భూములు అంటూ పెత్తనం చెలాయిస్తూ నిర్బంధిస్తూ బెదిరిస్తూ ఆదివాసీలపై అక్రమ కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తూ పిఓ కి మేము విన్నవించుకుంటే, పి ఓ రాహుల్, కూడా కనీసం పట్టించుకోకపోతే ఇక మా ఆదివాసులకు దిక్కెవరు అని వారు ప్రశ్నించారు. చదువుకొని ఉద్యోగాలు చేసి రాజ్యాంగానికి కట్టుబడి ఉంటామని ప్రమాణం చేసిన ఫారెస్ట్ వాళ్లే చట్టాలను ఉల్లంఘిస్తుంటే చూచి చూడనట్టుగా ఉంటున్న ఈ ఐటిడి ఆఫీసు ఎవరికోసం పనిచేస్తుంది అని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసుల కోసం ఆదివాసి గ్రామాల అభివృద్ధి కోసం ఆదివాసి రక్షణ కోసం అని చెప్పి పెట్టుకున్న ఈ ఐటీడీఏ ఆఫీసు ఏ ఒక్క ఆదివాసి సమస్యను పరిష్కరించలేదు అని మేము చెబుతున్నాం. ఈరోజు ధర్నాకు వస్తే ఉదయం 11 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ధర్నా చేస్తుంటే ఏ ఒక్క అధికారి ఆదివాసులను పట్టించుకోవట్లేదు అంటే ఈ ప్రజావాణి ఎవరిని ఉద్దేశించి పెడుతున్నారు తెలవాలి అని ఆయన అన్నారు. ప్రజావాణికి వందలాదిమంది పోడు సాగు రైతులు వస్తే పట్టించుకోకుండా పోలీసులతో సహారా కాపిస్తూ లోపలికి వెళ్ళనివ్వకుండా బయటకు రానివ్వకుండా ఆదివాసీలను ఐటిడీఏలోనే ఇబ్బందులకు గురి చేయడం అంటే ఇది దేన్నీ సూచిస్తుందో పిఓ, తమతో మాట్లాడాలని వారు చెప్పారు. గిరిజన ప్రజలు రైతులు, కూడు గూడు నీడ లేకుండా ఐటిడిఏ ముందు 6 గంటల పాటు ధర్నా నిర్వహించిన ఆదివాసీలు ఎంత బాధ ఉంటే వాళ్లు అంతసేపు ధర్నా నిర్వహించిన, అధికారులు స్పందించకపోవడం చాలా బాధాకరమని, ఒక్కసారి పాలకులు, ప్రభుత్వ అధికారులు ఆలోచించాలి. అని వారు కోరారు. కావున ఇప్పటికైనా పిఓ రాహుల్ కి తమరు ద్వారా తెలియజేసే విషయం ఏమిటంటే, తక్షణమే చర్ల దుమ్ముగూడెం మండలాలలోని పోడు సాగు రైతుల భూముల జోలికి, ఫారెస్ట్ అధికారులు రావద్దని, ప్రభుత్వ పరంగా, ఐటీడీఏ, ద్వారా సర్వే, చేసి, సాగు చేస్తున్న ఆదివాసి రైతులకు న్యాయం చేయాలని కోరుతూ, ఒకవేళ అది అటవీశాఖ భూమి అనే తేల్తే అటవీ శాఖకు అప్పగిస్తాం అని ఆవేదనతో అన్నారు. అప్పటివరకు మేము పంటలు పండించుకుంటాం కాబట్టి ఆ భూముల జోలికి, ఫారెస్ట్ అధికారులు రావద్దని ఐటిడిఏ సాక్షిగా తెలియజేస్తున్నాం, సార్, అని వారు కోరారు. కావున తక్షణమే అధికారులు స్పందించి ఫారెస్ట్ అధికారుళ్లతో మాట్లాడి ఆదివాసుల జోలికి పోకుండా, ప్రభుత్వపరంగా న్యాయం చేకూర్చాలని ఈ సందర్భంగా వారు కోరారు ఆదివాసీల కోసం ఉపయోగపడని ఈ ఐటీడీఏతో మాకు ఉపయోగం లేదని ఈ సభాముఖంగా,తెలియజేస్తున్నాం.కాలం నెత్తి మీదకు వచ్చింది భూమిని నమ్ముకుని బ్రతుకుతున్నాం ఇప్పుడు ఆ భూమిలో విత్తనాలు వేయనీయకుండా, భూమిని సాగు చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తే ఇక సహించేది లేదని ఆదివాసీలు ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి ఇక చావైనా రేవైనా పోడులోనే తేల్చుకుంటామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దుమ్ముగూడెం పార్టీ మండల కార్యదర్శి జోగారావు,మట్ట, నరసింహారావు తెల్లం, రామకృష్ణ ఇర్ప ప్రసాద్ తెల్లం పెంటమ్మ పాయం రాజమ్మ, సరేం, సాంబశివరావు తదితరులు, పాల్గొన్నారు.

# వైభవంగా కొనసాగుతున్న 'శ్రీ గుప్త జలవారాహి' నవరాత్రులు

**సింహరూఢ వారాహిగా అమ్మవారి దర్శనం**



**పిడికిలి/మహేశ్వరం, జులై 20:** శ్రీ కృత్య ప్రత్యంగిరా దేవి తాంత్రిక పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ గుప్త జలవారాహి దేవి నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా 6వ రోజైన ఈరోజు అమ్మవారు సింహరూఢ వారాహి అవతార రూపంలో భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ సదాపూర్ణి కృత్య ఆనందం తంత్రి అయ్యర్ మాట్లాడుతూ.. ఉత్సవాల్లో భాగంగా పీఠంలో విశేష పూజలు, హోమాలు నిర్వహించినట్లు తెలిపారు. మహాలక్ష్మి హోమం లోక కళ్యాణార్థం, భక్తుల ఐశ్వర్య ప్రాప్తి కోసం మహాలక్ష్మి హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రత్యంగిరా హోమం ఉదయం వేళ సింహరూఢ వారాహి దేవిని, దశమహావిద్యలలో ఒకరైన శ్రీ చిన్న మస్తా దేవి అనుసంధానంతో ఆవాహన చేస్తూ ప్రత్యేక ప్రత్యంగిరా హోమం జరిపించారు. రాత్రి 10 గంటలకు అమ్మవారికి అత్యంత వైభవంగా నక్షత్ర హారతులు సమర్పించనున్నారు. ఈ దివ్య పూజా కార్యక్రమాల్లో, అనంతరం నిర్వహించిన తీర్థప్రసాద వితరణలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలు పొందారని పీఠాధిపతి శ్రీ సదాపూర్ణి కృత్య ఆనందం తంత్రి అయ్యర్ వివరించారు.

# బిఆర్ఎస్ కి ఎన్నికలో ఇచ్చిన హామీలపై శ్వేతపత్రం విడుదల చేసే దమ్ముందా..?

**కాంగ్రెస్ నేత బోయపల్లి రాఘవేందర్ రెడ్డి**



**పిడికిలి/మహేశ్వరం, జులై 20:** కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు బీఆర్ఎస్ నాయకులకు లేదని, పదేళ్ల పాలనలో చేసిన వాగ్దానాలు, వైఫల్యాలపై కేసీఆర్, కేటీఆర్ తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని ఏఐసిసి విచార్ విభాగ్ కో ఆర్డినేటర్, సీనియర్ నాయకులు బోయపల్లి రాఘవేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బిఆర్ఎస్ ఎన్నికల హామీల అమలుపై శ్వేతపత్రం విడుదల చేసే ధైర్యం కేసీఆర్‌కు ఉందా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ వైఫల్యాలను ఎండగడుతూ ఆయన పలు ప్రశ్నలు సంధించారు: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలతో యువత జీవితాలతో ఆడుకున్నారని, నిరుద్యోగ భృతి హామీని పూర్తిగా విస్మరించారని మండిపడ్డారు. దళితుడిని తొలి సీఎం చేస్తామన్న మాట ఏమైందని, ప్రతి దళిత కుటుంబానికి 3 ఎకరాల భూమి ఇస్తామన్న హామీ ఎందుకు నెరవేర్చలేదని నిలదీశారు. పేదల కలల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, కేజీ టూ పీజీ ఉచిత విద్య నినాదాలకే పరిమితమయ్యాయని విమర్శించారు. పదేళ్లలో తెలంగాణను లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టి, ప్రభుత్వ ఆస్తులను తనఖా పెట్టింది కేటీఆర్ అని అన్నారు. అధికారం కోల్పోయిన బాధతోనే కేసీఆర్, కేటీఆర్‌లు వాస్తవాలను పక్కనబెట్టి ప్రభుత్వంపై నిరాధార విమర్శలు చేస్తున్నారని, ప్రజలు ఇచ్చిన తీర్పును జీర్ణించుకోవాలని రాఘవేందర్ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుర్రం లింగారెడ్డి, సత్యనారాయణ రావు, ఆర్ల నరసింహ, గుర్రం నరసింహారెడ్డి, పూల్ సింగ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# అన్ని రాష్ట్రాల్లో జోరు ఒక్క హైదరాబాద్‌లో తప్ప

**పార్లమెంట్ సమావేశాల్లో ఎంపీలు గళం విప్పాల్సిందే!**

**మెట్రో విస్తరణ వేగవంతానికి ఎంపీలు గళం విప్పాల్సిందే**

**నేటి నుంచి పార్లమెంట్ సమావేశాలు**

**నిర్మాణంలో ఉన్న నెట్‌వర్క్‌తో పోలిస్తే 9వ స్థానం**

**కేంద్రం వద్ద పెండింగ్‌లో ఇతర అంశాలు ఇవే!**



హైదరాబాద్ మినహా దేశంలోని మెట్రో నగరాలన్నింటిలో మెట్రో రైలు విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఢిల్లీ, చెన్నై, ముంబయి, బెంగళూరు, కోల్‌కతాలో రెండోదశ విస్తరణ పనులు పురోగతిలో ఉన్నాయి. హైదరాబాద్‌లో మాత్రం ప్రతిపాదిత విస్తరణ డీపీఆర్‌లకు అనుమతే దక్కలేదు. సోమవారం నుంచి పార్లమెంటు సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎంపీలు నగరానికి సంబంధించిన ఇతర అంశాలతో పాటూ మెట్రో విస్తరణకు అనుమతులపై గళం వినిపించాల్సి ఉంది. పార్టీలకు అతీతంగా ఎంపీలతో ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం నిర్వహించి ప్రస్తావించాల్సిన అంశాలపై దిశానిర్దేశం చేశారు. మెట్రో ప్రారంభమైన 2017లో నెట్‌వర్క్ పరంగా హైదరాబాద్ మెట్రో ఢిల్లీ తర్వాత రెండోస్థానంలో నిలిచింది. అప్పటి నుంచి విస్తరణ లేక ఆపరేషన్ నెట్‌వర్క్ పరంగా ఐదో స్థానానికి పడిపోయింది. నిర్మాణంలో ఉన్న నెట్‌వర్క్‌తో పోలిస్తే 9వ స్థానానికి దిగజారింది. మెట్రోరైలు రెండోదశలో కేంద్ర, రాష్ట్ర సంయుక్త భాగస్వామ్యంతో 7 కారిడార్లు 122.9 కి.మీ ప్రతిపాదించారు. అంచనా ఖర్చు రూ.38,595 కోట్లు. దీనిపై కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖలోని ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ డివిజన్ పరిశీలన ఆధారంగా వివరాలను కోరగా వాటికి సైతం సమగ్ర సమాధానాలు, అనుబంధ నివేదికలను రాష్ట్ర ప్రభుత్వం సమర్పించింది. భారత ప్రభుత్వంలోని పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డు(పీఐబీ) ఆమోదం కోసం సిద్ధంగా ఉంది. దీన్ని వీలైనంత త్వరగా ఆమోదం తెలిపేలా చూడాలని కేంద్రాన్ని ఎంపీలు కోరాలి. ఆ ఆమోదం తర్వాత కేంద్ర మంత్రిమండలి ముందుకు వస్తుంది.

**కేంద్రం వద్ద పెండింగ్‌లో ఇతర అంశాలు :**

సికింద్రాబాద్‌లోని ఏవోసీ కేంద్రం చుట్టూ ప్రత్యామ్నాయ రహదారుల నిర్మాణానికి 42.20 ఎకరాలు, భూమి విలువ, లైసెన్స్ రుసుం మినహాయింపు. ఉప్పల్‌లో ఫ్లైఓవర్ కోసం సర్వేఆఫ్ ఇండియాకు చెందిన 8.04 ఎకరాల బదలాయింపు. రసూర్‌పురాలో ఫ్లైఓవర్ నిర్మాణానికి 1.62 ఎకరాల కేటాయింపు. మూసీ వెంట రూ.4వేల కోట్ల అంచనాతో ట్రంక్ సీవర్ మెయిన్ నిర్మాణం. ఎలివేటెడ్ కారిడార్ కోసం ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ భూములు హెచ్ఎండీఏకు బదలాయింపుఓల్డ్ బేగంపేట వద్ద హెచ్ఎండీఏ ఎలివేటెడ్ కారిడార్ కోసం అండర్ గ్రౌండ్ టన్నెల్ తవ్వేందుకు ఎన్వోసీ పెరుగుతున్న అంచనా వ్యయం : ప్రాజెక్టు ఆలస్యం అయ్యే కొద్దీ మెట్రో అంచనా వ్యయాలు పెరుగుతున్నాయి. ఏటా రూ.2200 కోట్ల వరకు పెరిగే అవకాశం ఉంది. హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు భారం భారీగా పెరిగిపోతోంది. కేంద్రం సూచనల మేరకు డీపీఆర్‌లో చేసిన సవరణలు త్వరగా పూర్తి కాకుంటే ఈ అంచనా మరింత పెరిగే అవకాశం ఉందని మెట్రో వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండో దశలో పార్ట్-ఏ, పార్ట్-బీ కింద మొత్తం 8 కారిడార్లతో 162.5 కిలోమీటర్ల మేర ప్రాజెక్టును ప్రతిపాదించారు. ప్రాజెక్టును 50:50 నిష్పత్తిలో జాయింట్ వెంచర్‌గా చేపట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. పార్ట్-ఏకు సంబంధించిన డీపీఆర్‌ను 2024 నవంబర్ 4న, పార్ట్-బీ డీపీఆర్‌ను 2025 జులైలో కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం పంపింది. అనంతరం రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి భారత్ ఫ్యూచర్‌సిటీ వరకు 39.6 కిలోమీటర్ల కారిడార్‌ను మూడో దశగా విడదీశారు. దీంతో 7 కారిడార్లతో 122.9 కిలోమీటర్ల మేర నిర్మాణానికి రూ.35,000 కోట్ల అంచనా ఖర్చుతో సవరించిన డీపీఆర్‌ను కేంద్రానికి పంపారు.

# రెండు మేక పిల్లల కోసం దారుణ హత్య

**నెల్లూరు జిల్లాలో ఘటన**

**మేక పిల్లల పంపకంలో వివాదం.. యువకుడి హత్య**

**నెల్లూరు జిల్లా కావలిలో మేకల కాపరి దారుణ హత్య**

**పంచాయితీ పెట్టిన మాజీ సర్పంచే నిందితుడిగా ఆరోపణ**

**మద్యం తాగించి, పథకం ప్రకారం దాడి చేసి చంపిన వైనం**

**మాజీ సర్పంచ్‌తో పాటు మరొకరిని అరెస్ట్ చేసిన పోలీసులు**



నెల్లూరు జిల్లా కావలిలో అత్యంత దారుణమైన ఘటన వెలుగుచూసింది. రెండు మేక పిల్లల పంపకం విషయంలో మొదలైన ఓ చిన్న గొడవ, చిలికి చిలికి గాలివానగా మారి ఒక యువకుడి ప్రాణాన్ని బలి తీసుకుంది. ఈ హత్య కేసులో గ్రామ పెద్ద, మాజీ సర్పంచే ప్రధాన నిందితుడిగా ఉండటం స్థానికంగా కలకలం రేపుతోంది. వివరాల్లోకి వెళితే.. కావలి మండలం, సర్వాయపాలెం పంచాయతీ పరిధిలోని తాగేటివారిపాలేనికి చెందిన చాట్ల వాసు (26) మేకల కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన జనార్దన్ అనే వ్యక్తి తన మేకను సంరక్షణ కోసం వాసుకు అప్పగించాడు. ఇటీవల ఆ మేక ఐదు పిల్లలకు జన్మనిచ్చింది. దీంతో, మేకను కాపలా కాసినందుకు తనకు రెండు పిల్లలను ఇవ్వాలని వాసు యజమాని జనార్దన్‌ను కోరాడు. అయితే, మేకలను కాయడానికి ప్రతి నెలా కూలీ ఇస్తున్నందున, అదనంగా పిల్లలను ఇవ్వడం కుదరదని జనార్దన్ తేల్చి చెప్పాడు. ఈ విషయమై ఇద్దరి మధ్య వివాదం మొదలైంది. ఈ గొడవను జనార్దన్ గ్రామ పెద్ద, మాజీ సర్పంచ్ అయిన మందా మధు దృష్టికి తీసుకెళ్లాడు. ఈ సమస్యపై పంచాయితీ జరుగుతున్న సమయంలో వాసుకు, మధుకు మధ్య మాటామాటా పెరిగింది. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన మధు, వాసుకు ఎలాగైనా బుద్ధి చెప్పాలని నిర్ణయించుకున్నాడు. ఇందులో భాగంగా ఈ నెల 10వ తేదీన వాసును అడవిరాజుపాలెంలోని ఒక మద్యం దుకాణానికి పథకం ప్రకారం తీసుకెళ్లాడు. అక్కడ వాసుకు మద్యం తాగించిన తర్వాత, మధు తన ముగ్గురు అనుచరులతో కలిసి అతనిపై విచక్షణారహితంగా దాడి చేశాడు. తీవ్ర గాయాలతో పడి ఉన్న వాసును గమనించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. తొలుత మద్యం మత్తులో కిందపడి గాయపడ్డాడని అందరూ భావించారు. అయితే, చికిత్స పొందుతున్న సమయంలో వాసు అసలు విషయం చెప్పాడు. కొద్దిసేపటికే అతను ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు, ప్రధాన నిందితుడైన మంద మధుతో పాటు దాడికి సహకరించిన పందల రవిచంద్రను అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.ద

# 'లుక్ ఆఫ్ ది ఫ్యూచర్' - జెట్ స్పీడ్‌లో అమరావతి 'ఐకానిక్ టవర్స్' పనులు

**పునాది దశల సవాళ్లను జయించి శరవేగంగా శాశ్వత సచివాలయ నిర్మాణం**

**దేశంలోనే తొలిసారిగా డయాగ్రిడ్ టెక్నాలజీతో సచివాలయం నిర్మాణం**

**నేలను వీడి ఆకాశం వైపు దూసుకెళ్తున్న విభాగాధిపతుల ఐకానిక్ టవర్లు**



గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి చెక్ పెట్టి బాలారిష్టాలను దాటుకుని పునాది దశల సవాళ్లను జయించి నవ్యాంధ్ర కలలకు నిలువెత్తు రూపంగా అమరావతి శాశ్వత సచివాలయం శరవేగంగా ఆవిష్కృతమవుతోంది. దేశంలోనే తొలిసారిగా డయాగ్రిడ్ టెక్నాలజీతో నిర్మితమవుతున్న సచివాలయం, విభాగాధిపతుల ఐకానిక్ టవర్లు ఇప్పుడు నేలను వీడి ఆకాశం వైపు జెట్ స్పీడ్‌తో దూసుకెళ్తున్నాయి. రాష్ట్ర పరిపాలనకు శాశ్వత కేంద్ర బిందువుగా నిలవనున్న ఈ మహా నిర్మాణాలు అమరావతి రూపురేఖలను రోజురోజుకీ మార్చేస్తూ 'లుక్ ఆఫ్ ది ఫ్యూచర్'ను కళ్లముందు ఆవిష్కరిస్తున్నాయి. సంప్రదాయ భవనాల్లా నిలువు స్తంభాలు, అడ్డ బీమ్స్‌పై ఆధారపడే నిర్మాణం కాదు ఇది. దేశంలోనే తొలిసారిగా డయాగ్రిడ్ టెక్నాలజీతో అమరావతి సచివాలయం, హెచ్‌వోడీ టవర్లు రూపుదిద్దుకుంటున్నాయి. త్రిభుజాకార ఉక్కు నిర్మాణం, మధ్యలో పటిష్ఠమైన కోర్‌వాల్‌తో ఈ ఐకానిక్ టవర్లు ప్రపంచస్థాయి ఇంజినీరింగ్‌కు ప్రతీకగా నిలుస్తున్నాయి. డయాగ్రిడ్ నిర్మాణంలో భవనంపై పడే బరువు ఒకే చోట కాకుండా మొత్తం నిర్మాణానికి సమానంగా పంపిణీ అవుతుంది. దీంతో భూకంపాలు, పెనుతుపాన్ల వంటి ప్రకృతి విపత్తులను కూడా ఈ టవర్లు మరింత సమర్థంగా తట్టుకునేలా రూపకల్పన చేశారు. లోపల నిలువు స్తంభాలు లేకపోవడంతో మొత్తం ఫ్లోర్ స్పేస్‌ను కార్యాలయాలకే వినియోగించుకునే అవకాశం ఉంటుంది. ఉద్యోగులకు విశాలమైన పని వాతావరణంతో పాటు స్టీల్ వినియోగం తగ్గడం వల్ల నిర్మాణం మరింత సమర్థవంతంగా మారుతోంది. 26 x 23 మీటర్ల విస్తీర్ణంలో నిర్మిస్తున్న కోర్‌వాల్‌లో లిఫ్టులు, మరుగుదొడ్లు, పాంట్రీ, ఫైర్ సేఫ్టీ వ్యవస్థలు అన్నీ ఒకేచోట ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో అంతస్తు 50 x 50 మీటర్ల విస్తీర్ణంలో ఉండి ఆధునిక పరిపాలనకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. జీఏడీ టవర్‌లో 16, మిగిలిన 4 టవర్లలో 15 చొప్పున లిఫ్టులు ఏర్పాటు చేస్తున్నారు. ఒకే షాఫ్ట్‌లో 2 కాప్సూల్స్ తిరిగే డ్యూయల్ కాప్సూల్ వ్యవస్థతో పాటు అవి ఢీ కొనకుండా అత్యాధునిక యాంటీ-కొలిజన్ టెక్నాలజీని అమర్చుతున్నారు. ఐదు ప్రధాన టవర్లతో పాటు 9 ఎమినిటీస్ బ్లాక్స్ నిర్మిస్తున్నారు. ప్రజాఫిర్యాదుల హాల్, సమావేశ మందిరాలు, బ్యాంకులు, పోస్టాఫీస్, లైబ్రరీ, జిమ్, స్విమ్మింగ్ పూల్, చైల్డ్‌కేర్ సెంటర్, టెర్రస్ గార్డెన్స్‌తో ఇది సమగ్ర పరిపాలనా సముదాయంగా రూపుదిద్దుకుంటోంది. 40 నుంచి 50 అంతస్తుల టవర్లు కావడంతో పునాదుల నిర్మాణమే అతిపెద్ద సవాల్‌గా మారింది. వర్షాలు, నీటి సమస్యల మధ్య దాదాపు రెండేళ్లు ఫౌండేషన్ పనులకే పట్టినా ఇప్పుడు ఆ దశ దాటి భవనాలు మూడంతస్తుల ఎత్తుకు చేరుకుని శరవేగంగా ముందుకు సాగుతున్నాయి. విదేశీ జంపింగ్ ఫార్మ్‌వర్క్ టెక్నాలజీతో షట్టరింగ్‌ను నిమిషాల వ్యవధిలోనే పైఅంతస్తుకు తరలిస్తున్నారు. దీంతో రోజుల వ్యవధిలోనే ఒక్కో అంతస్తు పూర్తవుతూ నిర్మాణ వేగం 3 రెట్లు పెరిగింది. డైమండ్ ఆకారంలో పైకి ఎదిగే డయాగ్రిడ్ నిర్మాణం ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తోంది. సివిల్ పనులు శరవేగంగా సాగుతుండగా ఇదే వేగం కొనసాగితే అనుకున్న సమయంలోగా ఐకానిక్ టవర్ల ప్రధాన నిర్మాణం పూర్తికానుంది. అమరావతి పరిపాలనా గుండెకాయగా నిలవబోయే ఈ నిర్మాణాలు నవ్యాంధ్ర ఆశయాలకు శాశ్వత చిరునామాగా అవతరించనున్నాయి.

# రైలు ప్రయాణాలు చేస్తుంటారా

**ఈ కొత్త రూల్స్ కచ్చితంగా తెలుసుకోవాలి!**

**క్రిమినల్ శిక్షల స్థానంలో కొత్తగా సివిల్ జరిమానాలు**

**ఇప్పటివరకు ఉన్న జరిమానాలు మరింత పెంపు**

**చట్టం-1989లో చేసిన సవరణలు ఇవే**

**రైల్లో అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన శిక్ష**



రైల్వే ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం రైల్వే చట్టం-1989లో పలు మార్పులు చేసింది. తాజాగా జన్ విశ్వాస్-2026 పేరిట కొత్త చట్టం అమలులోకి తీసుకొచ్చింది. దీంతో ముందు కంటే ఈ చట్టం ద్వారా రైల్వేశాఖ ప్రయాణికులకు మరింత తోడ్పడనుంది. కొత్తగా అమలు చేసిన చట్టంలో తీసుకొచ్చిన మార్పులు ఏంటి అవి ప్రయాణికులకు ఎలా ఉపయోగ పడనున్నాయి. అనే విషయాన్ని ఈ కథనం ద్వారా తెలుసుకుందాం. కొత్తగా తీసుకొచ్చిన జన్ విశ్వాస్-2026 చట్టంలో ప్రధానంగా చాలా నిబంధనల్లో మునుపు ఉన్న క్రిమినల్ శిక్షలను తొలగించింది. వాటి స్థానంలో సివిల్ జరిమానాలను పెట్టింది. ఇలా జరిమానాల రూపంలో కేసులు త్వరగా పరిష్కారం అయ్యేలా సవరణలు చేసింది. దీంతో కోర్టులకు కూడా భారం తగ్గనుంది.

**చట్టం-1989లో చేసిన సవరణలు ఇవే :**

గతంలో టికెట్ లేకుండా ప్రయాణించిన వ్యక్తికి రూ.250 జరిమానా విధించేవారు. ఈ జరిమానాను ప్రస్తుతం రూ. 500కు పెంచారు. అంటే సంబంధిత వ్యక్తి టికెట్ రేటుతో కలిపి జరిమానా కూడా చెల్లించాల్సి ఉంటుంది. అప్పుడు ఇతరుల టికెట్ ద్వారా ట్రైన్‌లో ప్రయాణిస్తే 3 నెలల శిక్ష విధిస్తూ రూ.500 జరిమానా విధించేవారు. కానీ ఇప్పుడు జైలు శిక్షను మినహాయించి కేవలం పెనాల్టీ మాత్రమే విధిస్తారు. గతంలో రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికుడికి సీటు ఇవ్వకపోతే క్రిమినల్ కేసు నమోదు చేసేవారు. దాంతో పాటు రూ.500 పెనల్టీ విధించేవారు. కానీ ప్రస్తుతం తీసుకొచ్చిన కొత్త చట్టంలో మాత్రం ప్యాసింజర్‌ను అధికారులు ఖాళీ చేయించి, రూ.1000 జరిమానా విధిస్తారు. ఒకప్పుడు రైల్వే ఆవరణలో సిగరేట్ తాగితే రూ.200 జరిమానా ఉండేది. ఆ జరిమానాను ఇప్పుడు రూ.2000కు పెంచారు. అంతేకాదు ఆ వ్యక్తి టికెట్ రద్దు చేసి, స్టేషన్ పరిసరాల నుంచి పంపించేస్తారు. కొత్త చట్టం ప్రకారం సాధారణ టికెట్ తీసుకుని రిజర్వేషన్ బోగీల్లో ఎక్కితే రూ. 2000 జరిమానా విధిస్తున్నారు. ఇది గతంలో రూ.500 ఉండేది. ఒకవేళ రైల్లో నిషేధిత వస్తువులను తీసుకెళ్తే కొత్త చట్టం ప్రకారం వారికి రూ.10,000 జరిమానా విధిస్తారు. గతంలో రూ.500 విధించేవారు. రైళ్లలో భిక్షాటన, చిరు వ్యాపారాలు చేస్తే పాత చట్టంలో రూ. 2000 జరిమానాతో పాటు ఏడాది జైలు శిక్ష ఉండేది. కానీ ఇప్పుడు కేవలం పెనాల్టీ మాత్రమే వసూలు చేస్తారు. ఒకవేళ మహిళలకు కేటాయించిన బోగీల్లోకి పురుషులు ప్రవేశిస్తే వారికి రూ.2500 జరిమానా విధించేవారు. గతంలో టికెట్ రద్దు చేసి రూ. 500ల పెనాల్టీ వసూలు చేసేవారు. మద్యం తాగి రైల్లో ప్రయాణించటం, అసభ్యకరంగా ప్రవర్తించటం, తోటి ప్రయాణికులను ఇబ్బందికి గురి చేయడం వంటివి చేస్తే గతంలో 6 నెలల జైలు శిక్షలు విధించేవారు. అలాగే రూ.500 జరిమానా విధించేవారు. కొత్త చట్టం ప్రకారం జరిమానాను రూ. 1000కి పెంచి, శిక్షను తొలగించారు. ఒకవేళ సంబంధిత వ్యక్తి అదేపనిగా ఈ చర్యలకు పాల్పడితే రూ.5 వేల పెనాల్టీతో పాటు జైలుశిక్ష విధిస్తారు.



# పెరుగుతున్న కొవిడ్ కేసులు - ఈ జాగ్రత్తలు తీసుకోవడం ఉత్తమం!

**థాయ్‌లాండ్, సింగపూర్‌లలో వ్యాప్తిలో ఉన్న కొవిడ్ వేరియంటే మన దేశంలోనూ ఉంది**

**గుంపులుగా ఉండే ప్రదేశాల్లో మాస్కులు ధరించండి**

**ఫ్లూ ఉన్నవారు మిగతావారికి దూరంగా ఉండాలి**

**ప్రజలకు సూచిస్తున్న శాస్త్రవేత్తలు**



దేశవ్యాప్తంగా వివిధ నగరాల్లో కొవిడ్ కేసులు క్రమంగా పెరగడం కలవరపెడుతుంది. కొత్తది లేదా ప్రమాదకర వేరియంట్ వచ్చినట్లు ఏ మాత్రం ఆధారాల్లేవని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. థాయ్‌లాండ్, సింగపూర్ వంటి ఇతర దేశాల్లో వ్యాప్తి చెందుతున్న వేరియంటే మన దేశంలో కూడా ఉందని వివరిస్తున్నారు. ప్రజలు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మరింత అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో గత కొన్ని వారాల్లో కొవిడ్ కేసులతో నలుగురు మరణించారు. చనిపోయినవారు ఇతర తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నవారని అక్కడి వైద్యులు స్పష్టం చేశారు. "వైరస్ జన్యుక్రమ విశ్లేషణ ద్వారానే సంబంధిత వేరియంట్ గురించి మరింత సమాచారం మనకు లభిస్తుంది. ప్రస్తుతానికి సీసీఎంబీలో ఎలాంటి టెస్టులు చేయడం లేదు. దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు సుమారు 300 కేసులు నమోదుకావడం. ఇవి లక్షణాలు ఉన్నవారికి సంబంధించిన కేసులు మరోవైపు లక్షణాలు లేనివారు పరీక్షలు చేయించుకోకపోవచ్చు. కాబట్టి కేసుల సంఖ్యలో పెరుగుదల ఉందేమో తెలుసుకోవడానికి డాక్టర్లు నిరంతరం పర్యవేక్షించాల్సి ఉంటుంది". ఈ కొవిడ్ కేసులకు, సింగపూర్‌లో ప్రస్తుతం నమోదవుతున్న కేసులకు ప్రధానంగా ఒమిక్రాన్ ఆర్ఎఫ్.5 వేరియంటే కారణం అని డాక్టర్లు చెబుతున్నారు. ఒమిక్రాన్ లక్షణాలైన గొంతునొప్పి, దగ్గు, జ్వరం, తలనొప్పి, ముక్కుకారడం, అలసట వంటి సాధారణ ఫ్లూ తరహా లక్షణాలే వీటిలోనూ కన్పిస్తున్నాయని వివరిస్తున్నారు. ప్రస్తుతానికి భయపడాల్సిన పని లేకపోయినా గుంపులుగా ఉండే ప్రదేశాల్లో మాస్కులు ధరిస్తే చాలా మేలు జరుగుతుందన్నారు. ఫ్లూ ఉన్నవారు మిగతా వారికి దూరంగా ఉండటం వంటి జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు సూచనలు చేస్తున్నారు. "దేశంలో ప్రస్తుతం కొవిడ్ కేసుల సంఖ్య పెరుగుతోంది. వివిధ నగరాల్లో, థాయ్‌లాండ్, సింగపూర్ వంటి ప్రాంతాల్లో వ్యాపిస్తున్న వైరస్ రకమే ఏపీలో ఉండటాన్ని మనం గమనించవచ్చు. దీని వల్ల కొందరు మరణించడం బాధ కలిగించినప్పటికీ ఆ మరణాలకు ఇతర అనారోగ్య సమస్యలు కారణమా లేక కేవలం కొవిడ్ మాత్రమే కారణమా అనే వివరాలను పరిశీలించడం చాలా ముఖ్యం. నిరంతరం పర్యవేక్షణ, అప్రమత్తంగా ఉండటం రాష్ట్ర ప్రభుత్వం చేయాల్సిన పని. గతంలో ప్రజలకు టీకాలతో ఏర్పడిన రక్షణ, కరోనాపై ఉన్న అవగాహన, అనుభవంతో రాబోయే కొద్ది వారాల్లోనే కేసుల సంఖ్య తగ్గుతుందని అంచనా కూడా ఉంది"

# లైంగిక ఆరోపణల కేసు



జాతీయ పోలీస్ అకాడమీలో లైంగిక వేధింపుల వ్యవహారం కలకలం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏపీకి చెందిన ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి హైదరాబాద్‌లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆదివారం మోతీనగర్‌లోని బంధువు ఇంటికి వెళ్లిన ఉదయ్ కృష్ణారెడ్డి ఇవాళ ఉదయం శానిటైజర్ తాగి బలవన్మరణానికి యత్నించాడు. గమనించిన బంధువులు అతడిని ఎస్ఆర్ నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి తరలించగా ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. మరోవైపు ఉదయ్ కృష్ణారెడ్డిపై లైంగిక ఆరోపణల కేసులో దర్యాప్తు కొనసాగుతోంది. ప్రకాశం జిల్లా ఉళ్లపాలెం గ్రామానికి చెందిన ఉదయ్ కృష్ణారెడ్డి 2013లో కానిస్టేబుల్‌గా సెలక్ట్ అయ్యాడు. 2018 వరకు విధులు నిర్వర్తించాడు. ఆ తర్వాత ఉద్యోగానికి రాజీనామా చేసి సివిల్స్‌కు సిద్ధమయ్యాడు. నాలుగుసార్లు విఫలమైనా పట్టుదలతో ఐదోసారి 360 ర్యాంకుతో విజేతగా నిలిచాడు. ప్రస్తుతం అతను హైదరాబాద్‌లోని జాతీయ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్నాడు. ఈ అకాడమీలోనే కర్ణాటకకు చెందిన మహిళ కూడా ఐపీఎస్‌కు ఎంపికై ట్రైనింగ్‌లో ఉంది. ఈ సంవత్సరం జూన్ 23 నుంచి ఉదయ్ కృష్ణారెడ్డి సదరు మహిళా ట్రైనీ ఐపీఎస్ వాట్సప్ నంబర్‌కి అసభ్యకరమైన సందేశాలు పంపుతూ లైంగికంగా వేధించసాగాడు. ఆ మహిళ గౌరవాన్ని దెబ్బతీసేలా అకాడమీలో మిత్రుల ఎదుట తెలుగులో ఇబ్బందికరమైన పదాలతో అసభ్యకరంగా మాట్లాడంతో పాటు ఆమెకు వేరే వారితో వివాహేతర సంబంధం అంటగట్టి ప్రచారం చేసి మనోవేదనకు గురిచేశాడు. అంతేకాక ఆమెతో అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు బాధితురాలి వ్యక్తిగత వీడియోలను చిత్రీకరించి భర్తకు పంపి బెదిరింపులకు గురిచేశాడు. ఈ క్రమంలోనే బాధితురాలు శనివారం రాత్రి ఉదయ్ కృష్ణారెడ్డిపై అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో అతడిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మరోవైపు తనపై వచ్చిన ఫిర్యాదులు, ప్రచారాలపై ఉదయ్ కృష్ణారెడ్డి స్పందించాడు. అవన్నీ అవాస్తవమంటూ ఇన్‌స్టా వేదికగా పోస్ట్ చేశాడు. చట్టంపై తనకు పూర్తి నమ్మకం ఉందని న్యాయం గెలుస్తుందని తెలిపాడు.

Editor, printed and owned by Timmagalla Srihari, Published at 16-11-542/1 Gaddiannaram, Dilsukhnagar, Hyderabad Telanganastate
Printed at karshakartprinters, Vidyanagar Hyderabad, Telanganastate, Chiefeditor: Chamakura Raju RNI No.ApTel14145/2004